TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా.. ? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ... ? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...

సంపుటి : 3 సంచిక : 208 | మంగళవారం 21-07-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ | పేజీలు : 8 వెల 3 /-

పార్లమెంట్ ముందు ప్రధాని మోడీ

# సజావుగా పార్లమెంట్ సమావేశాలు సాగాలి




"మన ప్రజాస్వామ్యం బలోపేతానికి పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగడం అత్యంత ముఖ్యం."
--- నరేంద్ర మోడీ, ప్రధాని

## దేశం అనేక విజయాలను నమోదు చేస్తోంది

**ప్రజాస్వామ్యం సుస్థిరంగా సాగాలి**
ఎన్నికలు, అధికార పక్షాలు కలిసి దేశాభివృద్ధికి దోహదం చేయాలి.

**విక్రమ్ విజయవంతం.. యువకుల నైపుణ్యం**
ఇస్రో సాధించిన విజయం ప్రతి భారతీయుడి గర్వకారణం. మన యువత నైపుణ్యం ప్రపంచానికి చాటింది.

**అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం**
ప్రతి రంగంలో దేశం పురోగమిస్తోంది. దేశ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి.

**సమగ్ర చర్చలకు ప్రాధాన్యం**
ముఖ్యమైన జాతీయ అంశాలపై పార్లమెంట్‌లో విస్తృతంగా చర్చిద్దాం.

**విక్రమ్ విజయవంతం!**
భారత యువత శక్తి ప్రపంచానికి నిరూపణ
చంద్రయాన్--3 విజయంతో ఇస్రో మరో శిఖరాన్ని తాకింది.
ఇది కోట్లాది భారతీయుల గర్వకారణం.
దిగువ భాగం


**దేశం ముందడుగు**
కొత్త సంస్కరణలు, డిజిటల్ భారత్, స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాలు వేగంగా ముందుకు సాగుతున్నాయి. అభివృద్ధే లక్ష్యంగా మన ప్రయాణం.

2లో




# ఉద్రిక్తంగా చలో పార్లమెంట్ పిలుపు

- సిజెపి కార్యకర్తల రాకతో పార్లమెంట్ వద్ద ఉద్రిక్త
- పోలీస్ బారికేడ్లను దాటుకుని వచ్చిన వేలదిమంది
- ర్యాలీని అడ్డుకునేందుకు పోలీసుల లాఠీఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం



దేశ రాజధానిలోని జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నీట్-యూజీ పరీక్షల అక్రమాలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌తో కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద చేపట్టిన 'చలో పార్లమెంట్' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సీజేపీ మద్దతు దారులు బారికేడ్లను తోసుకొని పార్లమెంట్‌లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నిం చారు.

2లో

ఆపదలో అండగా...

# ఆర్టీసీ ఒకే కుటుంబం..!




- కార్మికుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది
- డ్రైవర్ కోలా శంకర్ కుటుంబానికి రూ. 90.85 లక్షల ఆర్థిక సాయం
- ఉద్యోగులంతా కలసి సమీకరించిన ధనం చెక్కు రూపంలో అప్పగింత

2లో



పామాయిల్ పెంపకం

# రైతులకు ఎంతో మేలు

- వర్షాభావంలోనూ పంటరకు ఢోకా లేదు
- పామాయిల్ ధరల పెంపునకు కృషి చేస్తున్నాం
- అంజనాపురంలో గోద్రెజ్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం
- మంత్రి తుమ్మలతో కలసి ప్రారంభించిన భట్టి

2లో



పామాయిల్ ధర పెంపునకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లా వ్యవసాయంపై ఆధారపడిన జిల్లా అని పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు కలిసి ప్రారంభించారు.

# హంద్రీనీవాపై వైసిపి నేతల రాజకీయం

## కాలువలపై మొసలి కన్నీరు కార్చొద్దు మాజీమంత్రి పరిటాల సునీత హెచ్చరిక



2లో

సూపర్ ఎల్‌నినో కాలంలో కూడా చాలా చోట్ల నీటి సమస్యలు ఉన్నా.. చెరువులలో నిండుగా నీరు పెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిది అని మాజీమంత్రి పరిటాల సునీత అన్నారు. గత ప్రభుత్వంలో గంప మట్టి కూడా ఎత్తివేయని వైసీపీ నాయకులు.. హంద్రీనీవా గురించి మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. హంద్రీనీవా ప్రాజెక్టు పొడవునా ఉన్న చెరువులను ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎంఎస్ రాజు, ధర్మవరం టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పరిశీలించారు.

## అన్ని వర్గాలనూ కాంగ్రెస్ మోసం చేసింది: కేటీఆర్



హైదరాబాద్: కాంగ్రెస్ నేతల మాటలు కోటలు దాటుతున్నాయని.. పనులు మాత్రం గడప కూడా దాటడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని.. చేశారా? అని ప్రశ్నించారు.

2లో

## తెలంగాణలో ఎక్కువగా ఎల్‌నినో ప్రభావం: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



2లో

## హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య



హైదరాబాద్: నగరంలోని బండ్లగూడ జాగీర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడిని సుధాకర్‌గా గుర్తించారు. ఇంటి బెడ్‌రూమ్‌లో విగతజీవిగా కనిపించడంతో కుటుంబసభ్యులు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మద్యం బాటిల్‌లో విషం కలిపి తాగినట్లు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సంపాదకీయం

## హే రామ్.. హే రావణ్.. ఇంత విద్వేషమా?

హే రామ్! హే రావణ్!... ఇంత విద్వేషాలు అవసరమా? కుల, మత, ప్రాంతాల వారీగా ఏమిటీ విష జ్వాలలు? తెలుగునాట, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు ఎవరి కోసం? విద్వేషపూరిత వాతావరణం సృష్టిస్తున్నది ఎవరు? దీనివల్ల ఎవరికి ప్రయోజనం? సోషల్ మీడియాను ఇంతలా దుర్వినియోగం చేస్తున్నది ఎవరు? భూమి మీద ఉన్నవారు సరిపోలేదని పురాణాల్లోని పాత్రలను కూడా వివాదాల్లోకి లాగాల్సిన అవసరం ఎవరికొచ్చింది? వాల్మీకి విరచిత రామాయణంలోని శ్రీరాముడిని, రావణ బ్రహ్మను కూడా తుచ్ఛ రాజకీయాలకోసం ముడి సరుకుగా వాడుకోవడం ఏమిటి? హిందువులు దైవ స్వరూపుడిగా కొలిచే శ్రీరాముడిని కించపరిస్తే వచ్చేది ఏమిటి? ఆ క్రమంలో రావణ బ్రహ్మను కూడా వాడుకోవడం ఏమిటి? పురాణాలను వివాదాస్పదం చేయడం వలన ప్రయోజనం ఏమిటి? వ్యాసుడు రచించిన మహాభారతంలోని సంఘటనలు, సన్నివేశాలను కూడా కించపరచడం ఏమిటి? ఈ పోకడలు అభ్యుదయ భావాలకు చిహ్నామా? హేతువాదానికి దీన్ని ప్రాతిపదికగా చెప్పుకోవచ్చా? ఎవరికోసమో ఇంకెవరో ఇంత సంకుచితంగా ఆలోచించడం, విద్వేషాలను ప్రచారం చేయడం ఆదర్శ భావాలకు ప్రతీక అవుతుందా? తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పుష్కర కాలం దాటినా తెలంగాణ వాదులమని చెప్పుకొనే కొందరికి ఆంధ్రా వారిపై అంత అక్కసు ఎందుకు? ఆంధ్రా వారికి తెలంగాణ వాదులపై కినుక ఇంకా అవసరమా? ఒకటి రెండు రాజకీయ పార్టీలకోసం ప్రజల మధ్య విభజన గీతలు గీస్తూ విద్వేషాలను ఎగదోయడం ఏమిటి? రాజకీయ విమర్శలకు--వ్యక్తిగత దూషణలకు మధ్య తేడా ఉండదా? ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలో కూడా చోటుచేసుకుంటున్న తాజా పరిణామాల నేపథ్యంలో ఈ ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. భాష--యాసలను కించపరచడం ఎలా అభ్యంతరకరమో హిందూ మత గ్రంథాలను అవమానించడం కూడా అంతే ఆక్షేపణీయం. ఈ పోకడల వల్ల ఒకటి రెండు రాజకీయ పార్టీలకు తాత్కాలిక ప్రయోజనం చేకూరవచ్చుగానీ దీర్ఘకాలంలో దాని వల్ల కలిగే అనర్థాల గురించి ఆలోచించరా? అధికారంలోకి రావాలనుకుంటున్న వారికిగానీ, అధికారంలో ఉన్నవారికిగానీ ఈ ధోరణులను అరికట్టాల్సిన బాధ్యత లేదా? సంక్షేమ పథకాల పేరిట అడ్డగోలుగా ఉచితాలను ప్రకటిస్తూ ప్రజలను సోమరిపోతులుగా చేయడమే కాకుండా రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలను ఛిన్నాభిన్నం చేసిన, చేస్తున్న రాజకీయ పార్టీలు... ఇప్పుడు మత ప్రాతిపదికన ప్రజలను చీల్చి ఏమి సాధించాలనుకుంటున్నాయి? కారణం ఏమైనా కొంతమంది యువతీ యువకులు రాజకీయ పార్టీల చేతిలో పావులుగా మారి సోషల్ మీడియా వేదికగా రెచ్చిపోతున్నారు. తెలంగాణలో మరుగునపడుతున్న తెలంగాణ సెంటిమెంటును రగిలించడానికి ప్రయత్నం జరుగుతుండగా, ఆంధ్రప్రదేశ్‌లో కుల మత ప్రాతిపదికన విభజన సృష్టించే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో జోసెఫ్ అలియాస్ రావణ్ అనే వ్యక్తి సోషల్ మీడియా వేదికగా చేసిన వీడియోలు, వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదం అయ్యాయి. ఈ వివాదం చినికి చినికి గాలివానగా మారింది. పోలీసులు అతడిని 'ఉపా' చట్టం కింద అరెస్టు చేశారు. దీంతో రావణ్ అనే వ్యక్తికి అనుకూలంగా, వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ఎవరికి తోచినట్టు వారు పోస్టులు, వీడియోలు పెడుతున్నారు. మరోవైపు తమ మత గ్రంథాలను, దేవుళ్లను కించపరచడంపై హిందువులు మండిపడుతున్నారు.

**ఎందుకీ వైపరీత్యం...**

రాజకీయ ప్రయోజనాల వేటలో మత గ్రంథాల జోలికి వెళ్లడం ఎందుకో? రంధ్రాన్వేషణ చేయడం మొదలు పెడితే ప్రతి మత గ్రంథంలోనూ లోపాలు కనిపిస్తాయి. రామాయణంలోని రాముడిని హిందువులు దైవంగా పూజిస్తారు. అలాంటి శ్రీరాముడిని కించపరుస్తూ మాట్లాడటం వల్ల హిందువులు సహజంగానే బాధపడతారు. శ్రీరాముడి పాత్రలోని ఔన్నత్యాన్ని గుర్తించకుండా లోపాలను మాత్రమే ఎత్తిచూపడం వల్ల సమాజానికి కలిగే ప్రయోజనం ఏమిటి? ఒక మతం వారు మరో మతానికి చెందిన ఆరాధ్య దైవాలను కించపరుస్తూ పోతే పరిస్థితి ఎక్కడికి దారి తీస్తుందో అర్థమవుతోందా? తండ్రి మాట జవదాటని, ఆడిన మాట తప్పని మహోన్నతుడిగా శ్రీరాముడిని వాల్మీకి ఆవిష్కరించారు. అందుకే శ్రీరాముడిని పురుషోత్తముడిగా హిందువులు ఆరాధిస్తారు. శ్రీరాముడు అరణ్యవాసం చేసినా, సీత చేత అగ్నిప్రవేశం చేయించినా అందులో అద్భుత సందేశం ఉందని నమ్ముతారు. దీనివల్ల క్రైస్తవాన్ని స్వీకరించిన జోసెఫ్ అనే వ్యక్తికిగానీ, అతడిని సమర్థించే వారికిగానీ వచ్చే నష్టం ఏమిటో తెలియదు. శ్రీరాముడిని వెక్కిరిస్తున్నామని అనుకొని తమ పేర్లను రావణ్‌గా మార్చుకుంటున్న వారికి రామాయణంలోని రావణ బ్రహ్మ క్యారెక్టర్ ఔన్నత్యం గురించి ఏ మాత్రమూ తెలియదనుకోవాలి. రావణ బ్రహ్మ రాక్షసుడు కాదు! అణువణువునా శివ భక్తిని నింపుకొన్నవాడు. శూర్పణఖ ముక్కూ చెవులూ కోశారన్న కోపంతో సీతను అపహరించడమే రావణ బ్రహ్మ చేసిన అపరాధం. అపహరించిన సాధ్వి సీత చిటికెన వేలు కూడా అతను ముట్టుకోలేదు. అవకాశం ఉండి కూడా ఆమెను తాకలేదు. త్రేతాయుగ ధర్మం ప్రకారం పరస్త్రీని అపహరించడం, వాంఛించడం మహాపాపం అని చెప్పడం కోసమే వాల్మీకి ఆ సన్నివేశాన్ని సృష్టించి ఉంటారు. తన చావుకు తనతోనే ముహూర్తం పెట్టిస్తున్నారని తెలిసి కూడా ముహూర్తం పెట్టుకున్న మహోన్నత పాత్ర రావణ బ్రహ్మది. పురాణాల్లోని సంఘటనలు, సన్నివేశాల్లోని పరమార్థం తెలుసుకోకుండా వెకిలి వ్యాఖ్యలు చేయడం... అలా చేస్తున్న వారి అల్పత్వానికి నిదర్శనం అవుతుందే తప్ప పౌరాణిక పాత్రల ఔన్నత్యం ఏ మాత్రం తగ్గదు. మహాభారతాన్నే తీసుకుందాం. మనుషుల్లోని బలాలు బలహీనతలన్నీ మహా భారతంలోని పాత్రలలో కనిపిస్తాయి. సర్వకాల సర్వావస్థలకూ వర్తించే మహాభారతాన్ని మించిన గ్రంథం మరొకటి ఉంటుందా? వ్యాసుడిని మించిన రచయిత మరొకరు కనిపిస్తారా? అని ప్రశ్నించుకోవాలి. ఆయా సన్నివేశాల్లోని పరమార్థాన్ని గ్రహించకుండా అదేమిటీ ఇదేమిటీ అని రంధ్రాన్వేషణకు పూనుకోవడం మన అల్పత్వానికి నిదర్శనం. ఇప్పుడు కూడా మన చుట్టూ ఉన్న అనేక క్యారెక్టర్లు మహాభారతంలో కనిపిస్తాయి. అంతేకాదు, అన్ని వేల పాత్రలకు పేర్లు పెట్టడం సామాన్య విషయం కాదు కదా? మన పిల్లలకు పేర్లు పెట్టడానికి రోజుల తరబడి బుర్రకు పదునుపెడుతూ పుస్తకాలు తిరగేస్తున్న మనకు వ్యాసుడి గొప్పతనం తెలియకపోతే ఎలా? మానవ జాతి పరిణామంలో అనేక జాతులు, మతాలు పుట్టాయి. అందులో కొన్ని అంతరించాయి. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా ఈ ఆధునిక యుగంలో కూడా రాతి యుగం నాటి మూర్ఖత్వం ప్రదర్శించడం ఏమిటి? రెండు వేల సంవత్సరాల క్రితం క్రైస్తవ మతం లేదు కదా! క్రీస్తు పూర్వం, క్రీస్తు శకం అని మనమే విభజించుకున్నాం కదా! మనుషులు తమ స్వార్థం కోసం ఎంతకైనా దిగజారుతారని మత గ్రంథాలు చెబుతున్నాయి. అందుకే పాప పుణ్యాలు అని పేర్కొన్నారు. జీసస్‌ను శిలువ వేసి చంపిన మనుషులే ఆయనను దేవుడిగా మార్చుకున్నారు. సోక్రటీస్‌కు విషం ఇచ్చి చంపినవారే ఆ తర్వాత ఆయనను మహా తత్వవేత్తగా గుర్తించి గౌరవించారు. పాపం చేయడం, ఆ తర్వాత పాప పరిహారం చేసుకోవడం మనుషులకు అలవాటే. ఇప్పుడు అసలు విషయానికి వద్దాం!

**కుట్రలు.. సూత్రధారులు!**

జోసెఫ్ అలియాస్ రావణ్ అనే వ్యక్తి హిందువుల మనోభావాలను గాయపరచడం వల్ల ఏం సాధించాడు? ఉపా చట్టం కింద అరెస్టు చేయడానికి ముందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొందరపాటుతో అతడిని నాలుగు పర్యాయాలు బలహీనమైన కేసులలో ఎందుకు అరెస్టు చేయవలసి వచ్చింది? ఈ క్రమంలో రంగప్రవేశం చేసిన క్యారెక్టర్లు ఎవరు? వారి వెనుక ఎవరున్నారు? మత విద్వేషాలు రగిలించి చలి కాచుకోవాలనుకున్న రాజకీయ పార్టీలు ఏవి? వంటి ప్రశ్నలకు సమాధానాలు అన్వేషించాలి. తెలంగాణలో కేసీఆర్ కుటుంబం, ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డి అధికారం కోల్పోయాక రాజకీయాలలో విద్వేషాలను చొప్పించడం మొదలైంది. కేసీఆర్ అధికారంలో ఉన్నంత కాలం ఆంధ్రా-- తెలంగాణ అన్న భేద భావం ప్రజల్లో కనిపించలేదు. ఇప్పుడు కేసీఆర్ అధికారం కోల్పోయిన తర్వాత అవకాశం చిక్కినప్పుడల్లా ఆంధ్రా, తెలంగాణ అనే విభజన తీసుకొచ్చే ప్రయత్నాలు మొదలయ్యాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆ మధ్య హైదరాబాద్ పర్యటన సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇళ్లకు వెళ్లడం,

## అన్ని వర్గాలనూ కాంగ్రెస్ మోసం చేసింది: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలోని అన్నివర్గాలనూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. తెలంగాణ భవన్‌లో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌లోనే ఉంటానని చెప్పిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాటతప్పారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పోచారంతోపాటు కాంగ్రెస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు.

"కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయి.. మోటార్లు కాలిపోతున్నాయి. రైతులకు యూరియా అందించలేకపోతున్నారు. కేసీఆర్ హయాంలో రైతులకు అన్నీ ఇళ్ల వద్దకే వచ్చేవి. రూ.2లక్షల రుణమాఫీ చేశామని కాంగ్రెస్ నేతలు చెప్పారు. 30-40 శాతమైనా పూర్తిచేశారా? ఒక్క ఊరిలో అయినా వందశాతం రుణమాఫీ చేసినట్లు నిరూపించాలని సీఎం రేవంత్‌కు అసెంబ్లీలోనే సవాల్ విసిరా. కేసీఆర్ హయాంలో 11 సార్లు రైతుబంధు వేశారు. కాళేశ్వరంపై మాట్లాడినవన్నీ అబద్ధాలే అని ప్రజలకు తెలిసిపోతుందనే రేవంత్ నీళ్లు వదలడం లేదు. మేడిగడ్డ బ్యారేజ్‌లో కుంగిన రెండు పిల్లర్లకు మరమ్మతులు ఎందుకు చేయలేదు? ఎల్‌నినో వస్తుందని ఆరు నెలల ముందే శాస్త్రవేత్తలు చెబితే.. ప్రభుత్వం ఇప్పుడు సమీక్షలు చేస్తోంది. సరైన ప్రణాళిక లేకుండా సీఎం పనిచేస్తున్నారు" అని కేటీఆర్ విమర్శించారు.

## తెలంగాణలో ఎక్కువగా ఎల్‌నినో ప్రభావం:

మొదటిపేజీ తరువాయి

నల్గొండ: ఎల్‌నినో ప్రభావం తెలంగాణలో ఎక్కువగా ఉందని రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వరి వేస్తే ఇబ్బందులు ఎదురవుతాయని.. ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. నల్గొండ కలెక్టరేట్‌లో నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల అధికారులతో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నీళ్లు లేవని.. వర్షాలూ తక్కువేనన్నారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపాలన్నారు. తక్కువ నీరు అవసరమయ్యే పంటలు వేసుకోవాలని.. దీనిపై రైతులకు దిశానిర్దేశం చేయాలని అధికారులకు సూచించారు. ఎల్‌నినో పరిస్థితులకు తగ్గట్టుగా ఉమ్మడి నల్గొండ జిల్లా సిద్ధం కావాలని చెప్పారు.

## పామాయిల్ పెంపకం రైతులకు ఎంతో మేలు

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉందని.. వివిధ కారణాలతో సీఎం రాలేకపోయారని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా రైతులకు సీఎం రేవంత్‌రెడ్డి తన శుభాకాంక్షలు తెలిపారని అన్నారు. అంజనాపురంలో ఆయిల్ పామ్ కాంప్లెక్స్ నిర్మించిన గోద్రెజ్ సంస్థకు భట్టి విక్రమార్క కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి విశేషంగా కృషిచేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి అభినందనలు చెప్పారు. ఖమ్మం జిల్లా రైతన్నలు అన్ని రకాల పంటలు సాగు చేస్తారని వెల్లడించారు. తాను ఎన్నో రకాల పంటలు సాగు చేశానని ఏ పంటకు రాని దిగుబడి ఆయిల్ పామ్‌కు వచ్చిందని మంత్రి తుమ్మల స్వయంగా తనతో చెప్పారని అన్నారు. చివరకు ప్రకృతి విపత్తులను

కూడా ఈ పంట తట్టుకొని నిలబడుతుందని చెప్పుకొచ్చారు. పామాయిల్ సాగు చేసిన రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వెల్లడించారు. దేశంలో 25 లక్షల మిలియన్ టన్నుల పామాయిల్ అవసరం ఉందని తెలిపారు. దేశంలో కేవలం 12 లక్షల మిలియన్ టన్నుల పామాయిల్ మాత్రమే ఉత్పత్తి అవుతుందని చెప్పుకొచ్చారు. 1992లో ప్రారంభించిన పామాయిల్ సాగు ఇప్పటికి దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలిపే స్థాయికి వచ్చిందని భట్టి విక్రమార్క వివరించారు. గతంలో పామాయిల్ టన్ను గెల ధర రూ.12000లు ఉంటే.. నేడు టన్ను ధర రూ.23 వేలకు పెరిగిందని వెల్లడించారు. అంజనాపురంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం.. ఖమ్మం జిల్లా అన్నదాతలకు ఓ వరమని ఉద్ఘాటించారు. వ్యవసాయ ఉత్పత్తుల పరిశ్రమలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా వేదిక కాబోతోందని తెలిపారు. రాబోయే రోజుల్లో అనేక రకాల పరిశ్రమలు ఇక్కడికి రాబోతున్నాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. జిల్లాలో గోద్రెజ్ కంపెనీ ఆయిల్ పామ్ కాంప్లెక్స్ నిర్మించడం సంతోషంగా ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఈ కాంప్లెక్స్‌లో అత్యాధునిక సీడ్ గార్డెన్ ఏర్పాటు చేశారని తెలిపారు. గోద్రెజ్ కంపెనీకి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని, రైతులకు అన్ని విధాలా అందుబాటులో ఉండేలా కంపెనీ సేవలందించాలని ఆకాంక్షించారు. ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ ముందు ఉందని మంత్రి తుమ్మల తెలిపారు. రాష్ట్రంలో పది లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు కృషి జరుగుతోందని చెప్పారు. ఈ సందర్భంగా రైతులంతా ఈ పంట సాగుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయిల్ పామ్‌తో ఎలాంటి నష్టం ఉండదన్నారు. ఆయిల్ పామ్ కింద ఇప్పటికే మూడు ఫ్యాక్టరీల నిర్మాణం పూర్తయిందని, మరో ఆరు ఫ్యాక్టరీల నిర్మాణం జరుగుతోందని వెల్లడించారు. తెలంగాణ భూములు ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమని మంత్రి పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో అన్ని జిల్లాల్లో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీల నిర్మాణం జరగాలన్నదే తన లక్ష్యమని చెప్పుకొచ్చారు. దక్షిణ భారతదేశ నేతలందరూ ఆయిల్ పామ్ దిగుమతిపై సుంకం తగ్గించాలని కోరుతున్నామని మంత్రి చెప్పారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నామని, ఆయిల్ పామ్ సాగుతో వారి జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు మంత్రి తుమ్మల. తన యాభై సంవత్సరాల వ్యవసాయ అనుభవంలో ఎన్నో పంటలు పండించామని, ఏ పంటకు రాని ఆదాయం దీనికి వస్తుందన్నారు. ఆయిల్ పామ్‌ను ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన నాటి నుంచి తాను కూడా సాగు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు, ఎల్‌నినో ప్రపంచాన్ని కబళించే పరిస్థితి ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. దాని కారణంగా రుతుపవనాలు సరిగా రాలేదని, మానవజాతి చేసిన విధ్వంసం తిరిగి మన పాలిటే మహమ్మారిగా మారిందన్నారు. దక్షిణ భారతదేశంలో ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉందని, ఉద్యానవన పంటల సాగుతో భూములను చల్లబరచాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

### ఆపదలో అండగా...

## ఆర్టీసీ ఒకే కుటుంబం..!

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్,జూలై 20: టీజీఎస్ ఆర్టీసీ కేవలం ఒక రవాణా సంస్థ మాత్రమే కాదని... వేలది మంది ఉద్యోగుల ఉమ్మడి కుటుంబమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. నర్సంపేట ఆర్టీసీ డిపోకు చెందిన దివంగత డ్రైవర్ కోలా శంకర్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులు 'చేయూత' కార్యక్రమం ద్వారా స్వచ్ఛందంగా సేకరించిన రూ. 90,85,500 తొంభై లక్షల ఎనభై ఐదు వేల ఐదు వందల రూపాయల భారీ ఆర్థిక సహాయ చెక్కును సోమవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శంకర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ వై.నాగిరెడ్డి ల చేతుల మీదుగా దివంగత డ్రైవర్ సతీమణి హేమలత, కుమారుడు హేమంత్, కుమార్తె షాలినిలకు ఈ చెక్కును అందజేసి సంస్థ తరఫున పూర్తి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కార్మికుల కోసం ప్రాణత్యాగం చేసిన దివంగత కోల శంకర్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులందరూ అండగా నిలవడం వారి మానవత్వానికి నిదర్శనమన్నారు. శంకర్ ఆసుపత్రిలో ఉన్న సమయంలో అర్ధరాత్రి వేళ స్వయంగా వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. కుటుంబానికి ప్రజా ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, అందులో భాగంగానే దివంగత శంకర్ కుమారుడు హేమంత్‌కు ఆర్టీసీలో ఉద్యోగం కల్పిస్తున్నామని, అలాగే ఆ కుటుంబానికి ఇల్లు కూడా మంజూరు చేశామని ప్రకటించారు.

## సజావుగా పార్లమెంట్ సమావేశాలు సాగాలి

మొదటిపేజీ తరువాయి

**దేశం అనేక విజయాలను నమోదు చేస్తోంది**

**విక్రమ్ విజయవంతం..యువకుల నైపుణ్యం**

**పార్లమెంట్ ముందు మీడియాతో ప్రధాని మోడీ**

న్యూఢిల్లీ,జూలై20: పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. ఈ సమావేశాలు నిర్మాణాత్మకంగా జరుగుతాయని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా మోడీ మీడియాతో మాట్లాడారు. గత నెల రోజులుగా దేశంలో అనేక పరిణామాలు జరిగాయని వెల్లడించారు. అంతరిక్ష ప్రస్థానంలో నవశకం ప్రారంభమైందని తెలిపారు. స్టార్టప్ కంపెనీ తయారు చేసిన విక్రమ్-1 రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిందని వివరించారు. సోమవారం పార్లమెంట్ దగ్గర మీడియాతో ప్రధాని మాట్లాడారు. భారత అంతరిక్ష ప్రస్థానంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైందని ఉద్ఘాటించారు. భారతదేశ యువత అంతరిక్షంలోకి దూసుకుపోయిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. విక్రమ్-1 విజయం వెనుక యువత పాత్ర కీలకమని తెలిపారు. స్కైరూట్ విజయవంతం అవడం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. అదే సమయంలో అంతరిక్ష రంగ స్టార్టప్ స్కైరూట్ 'విక్రమ్-1' ప్రయోగం విజయవంతం అవడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. 28 ఏళ్ల సగటు వయసున్న ఆవిష్కర్తలదే ఈ ఘనత అని కొనియాడారు. 'ఏడాది కాలంలో ఎన్నో గొప్ప విషయాలు జరిగాయి. అంతరిక్షంతో సహా వేదిక ఏదైనా.. మనం సాధించిన విజయాలు దేశానికి గర్వకారణం. గత సంవత్సరం వర్షాకాల సమావేశాలకు ముందు ఒక భారతీయ పౌరుడు శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నారు. ఇప్పుడు ఒక భారతీయ స్టార్టప్ స్కైరూట్ అద్భుతమైన ఘనత సాధించిందని మోదీ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి పరోక్షంగా చురకలంటించారు. భారత యువత అంతరిక్షంలో ఒక కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ప్రపంచంలోని కొన్ని దేశాల్లో మాత్రమే ఇలాంటి ప్రైవేటు సంస్థలు ఉన్నాయి. స్కైరూట్ స్టార్టప్ బృందం సగటు వయసు 28 ఏళ్లని నాకు తెలిసింది. ఇక్కడ నేను 56 ఏళ్ల యువకుడి గురించి మాట్లాడటం లేదని పరోక్షంగా రాహుల్‌ను ఉద్దేశించి మోదీ అన్నారు. యువత సాధించిన ఈ విజయం యాదృచ్ఛికం కాదు. మన దేశ యువత సామర్థ్యం, ఆకాంక్షలు అంతరిక్షం వలే హద్దుల్లేనివని చెప్పే సందేశం ఇదని ప్రధాని ప్రశంసించారు. రాజస్థాన్‌లో అతిపెద్ద ఆయిల్ రిఫైనరీని దేశానికి అంకితం చేశామని వెల్లడించారు. ఒక సెమీ కండక్టర్ ప్లాంట్, గ్రీన్ హైడ్రోజన్ రైలును ప్రారంభించామని తెలిపారు. యుద్ధంతో చాలా దేశాలకు నష్టం జరుగుతోందని చెప్పారు. చమురు ధరలు అమాంతం పెరుగుతు న్నాయని తెలిపారు. 7.7శాతం గ్రోత్‌రేట్ భారత్ నమోదు చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'వర్షాకాలం, వర్షాకాల సమావేశాలు.. ఈ రెండు చురుగ్గా ఉంటే ఫలితాలు గొప్పగా ఉంటాయి. అప్పుడే దేశం సంక్షేమంగా ఉంటుంది. అందుకే ఈ రెండూ మెరుగ్గా ఉండాలని కోరుకుంటున్నాను' అని మోదీ తెలిపారు. గందరగోళ పరిస్థితులకు తావులేకుండా పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చలు జరగాలని ఆకాంక్షించారు.

## ఉద్రిక్తంగా చలో పార్లమెంట్ పిలుపు

మొదటిపేజీ తరువాయి

వారిని అడ్డుకునేందుకు పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించి ఆందోళనకారులను చెదరగొట్టారు. సోమవారం పార్లమెంట్ మార్చ్ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కార్యకర్తలు, మద్దతుదారులు జంతర్ మంతర్ వద్దకు భారీగా చేరుకున్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది విద్యార్థులు కూడా హాజరయ్యారు. దీంతో ఆ ప్రాంతంలో భద్రతా దళాలు పెద్దఎత్తున మోహరించాయి.

దీంతో ఢిల్లీలోని పార్లమెంట్ వద్ద హైటెన్షన్ వాతావరణం నెలకొంది. రైసినా రోడ్డు మార్గంలో ఈ ఘటన జరిగింది. పార్లమెంట్‌కు సుమారు 200 మీటర్ల దూరంలో ఆందోళనకారుల్ని పోలీసులు అడ్డుకున్నారు. జంతర్ మంతర్ నుంచి సీజేపీ.. పార్లమెంట్ మార్చ్ చేపట్టిన విషయం తెలిసిందే. ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా వద్ద ఆందోళనకారులపై టియర్ గ్యాస్ ప్రయోగించారు. సీజేపీ కార్యకర్తలను చెదరగొట్టే ఉద్దేశంతో టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. సన్‌సద్ మార్గ్ రోడ్డులో వస్తున్న ఆందోళనకారుల్ని కూడా పోలీసులు అడ్డుకున్నారు. సన్‌సద్ మార్గ్ పోలీసు స్టేషన్ వద్ద బారికేడ్లు పెట్టి నిరసనకారుల్ని ముందుకు కదలకుండా చేశారు. అయినా తోసుకుని రావడంతో భద్రతా బలగాలు లాఠీఛార్జ్ చేశాయి. ఆ ఘర్షణలో కొందరు ఆందోళనకారులు గాయపడ్డారు. సైట్ వద్దే వారికి ప్రథమ చికిత్స అందించారు. వికాస్ మార్గ్‌లోని ఐటీవో వద్ద కూడా నిరసనకారులను బ్లాక్ చేశారు. ఐటీవో, సెంట్రల్ ఢిల్లీ రూట్లో ఇది కీలకమైన ప్రదేశం. పార్లమెంట్, జంతర్ మంతర్ ఈ మార్గంలోనే ఉన్నాయి. పార్లమెంట్ స్ట్రీట్ వద్ద వేల సంఖ్యలో సీజేపీ కార్యకర్తలు చేరుకున్నారు. వారిపై లాఠీఛార్జ్ జరిగినట్లు తెలుస్తోంది. బారికేడ్లను తొలగించేందుకు నిరసనకారులు ప్రయత్నించారు. పోలీసులకు, సీజేపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. సుమారు 15 మంది ఆందోళనకారు లను అదుపులోకి తీసుకున్నారు. ర్యాలీ ప్రారంభమైన వెంటనే నిరసనకారులను భద్రతా బలగాలు అడ్డుకున్నాయి. ఈ సందర్భంగా భద్రతా సిబ్బంది, సీజేపీ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో వారిని చెదరగొట్టేందుకు భద్రతా దళాలు లాఠీఛార్జ్ చేశాయి. పలువురిని అరెస్టు చేశారు. మరోవైపు, ఇప్పటికే పార్లమెంట్‌కు వెళ్లే అన్ని మార్గాలను అధికారులు మూసివేశారు. జంతర్ మంతర్‌తో పాటు పటేల్ చౌక్, పార్లమెంట్ స్ట్రీట్, రైల్ భవన్ ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఐదు మెట్రో స్టేషన్లను కూడా మూసివేశారు. అలాగే సెంట్రల్ ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్‌ను నిలిపివేశారు. పార్లమెంట్ సమావేశాల ప్రారంభం రోజున తలపెట్టిన ఈ మార్చ్‌కు పోలీసులు అనుమతి నిరాకరించారు. ఎక్కడికక్కడ విద్యార్థులను అడ్డుకొనేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినప్పటికీ.. భారీ సంఖ్యలో నిరసనకారులు బారికేడ్లను దాటుకొని పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. దాంతో వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జి చేశారు. భాష్పవాయువు గోళాలను ప్రయోగించారు. కొందరిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈక్రమంలో పలువురు పోలీసులకు గాయాలైనట్లు సమాచారం.

## హంద్రీనీవాపై వైసిపి నేతల రాజకీయం

మొదటిపేజీ తరువాయి

హంద్రీనీవా ప్రాజెక్టు పరిరక్షణ పేరుతో ఆదివారం ఆ కాలువను వైసీపీ నేతల బృందం పరిశీలించిన విషయం తెలిసిందే. హంద్రీనీవా కాలువల పరిశీలన పేరుతో వైసీపీ నేతల బృందం పర్యటనపై టీడీపీ నేతలు మండిపడు తున్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. హంద్రీనీవా లైనింగ్ పనులలో ఎక్కడ నాసిరకం పనులు జరిగాయని, ఏ కాంట్రాక్టర్ చేశాడో చెప్పండని నిలదీశారు. నాసిరకం పనులు చూపితే అదే కాంట్రాక్టర్‌తో పనులను సరిచేయిస్తాం. క్షేత్రస్థాయిలో వైసీపీ నాయకులు నీటితో నిండిన చెరువులను చూసి ఆత్మవిమర్శ చేసుకోండని అంటూ ఎమ్మెల్యే హితవు పలికారు. వైసీపీలో రాజకీయ అనుభవం ఉన్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి లాంటి నేతలు.. కూటమి ప్రభుత్వ అభివృద్ధిని ప్రశంసిస్తున్నారని తెలిపారు. వైసీపీ.. పార్టీ మనుగడ కోసం పొరుగు జిల్లాల నుంచి నేతలను పిలిపించుకొని కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వేద సంస్కృతి పరిరక్షణకు వేములవాడ రాజన్న ఆలయం మరో ముందడుగు

**– వేద పరీక్షలు, మూడు రోజుల వర్ణయాగానికి ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు ఆహ్వానం**



వేములవాడ/ప్రజాదివాస్ జూలై 20

వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెలలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయంలో వేద విద్యా పరిరక్షణ, ప్రోత్సాహానికి ప్రాధాన్యం ఇస్తూ జూలై 21 నుంచి జూలై 26, 2026 వరకు వేద పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు భీమేశ్వర సదన్ (మైత్రి గెస్ట్ హౌస్) సమీపంలో నిర్వహించబడనున్నాయి. దేశ నలుమూలల నుండి వివిధ ప్రాంతాల నుంచి వేద విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొని తమ వేదాధ్యయన ప్రతిభను ప్రదర్శించనున్నారు. వేద పారాయణం, మంత్రోచ్చారణ, స్వర శుద్ధి తదితర అంశాలపై పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహం అందించనున్నారు. అదేవిధంగా, తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు జూలై 30, 2026 నుంచి ఆగస్టు 1, 2026 వరకు మూడు రోజుల పాటు "వర్ణయాగం"ను ఘనంగా నిర్వహించనున్నారు. వేదోక్త విధానంలో నిర్వహించే ఈ మహాయాగం ద్వారా రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సకాలంలో వర్షాలు కురవడం, పాడిపంటలు సమృద్ధిగా పండడం, దేశంలో శాంతి, సామరస్యం నెలకొనాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. వర్ణయాగం వేద సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తూ సనాతన ధర్మ పరిరక్షణకు దోహదపడే విశిష్ట ఆధ్యాత్మిక కార్యక్రమంగా భావించబడుతోంది. ఈ కార్యక్రమాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ను ఆలయ అధికారులు ఈరోజు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఆలయ ఈవో శ్రీమతి ఎల్. రమాదేవి ఆదేశాల మేరకు ఆలయ డిప్యూటీ ఈవో నవీన్ కుమార్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నాగుల మహేష్, ఆలయ ఇన్‌చార్జ్ స్థానాచార్యులు నమ్మిలికొండ ఉమేష్, ఆలయ ఉద్యోగులు, వేద పండితులు, అర్చకులు కలిసి కార్యక్రమాల వివరాలను తెలియజేసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ, వేద పరీక్షలు మరియు వర్ణయాగం వంటి కార్యక్రమాలు వేద సంస్కృతి పరిరక్షణకు, యువతలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడానికి, సమాజ శ్రేయస్సు కోసం సామూహిక ప్రార్థనలు నిర్వహించడానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు.

# శివ కేశవ ఆలయంలో గ్రామస్తులు పెద్ద చెరువులో నుండి నీళ్లు తెచ్చి శివునికి జలాభిషేకం

**– వర్షాలు సమృద్ధిగా కురవాలని శివుని వేడుక**



ముస్తాబాద్/ జులై 20 ప్రజా దివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో గల శివ కేశవ ఆలయంలో సోమవారం శివ కేశవ ఆలయ కమిటీ చైర్మన్ మిడిదొడ్డి శరయ్య గ్రామ సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి పాలకవర్గ సభ్యులు గ్రామ ప్రజలతో కలిసి వర్షాలు సమృద్ధిగా కురువలని కోరుతూ రైతులు గ్రామంలో గల పెద్ద చెరువులో నుండి బిందెల ద్వారా నీటిని తీసుకువచ్చి గ్రామస్తులు శివునికి జలాభిషేకం చేయడం జరిగింది అనంతరం గ్రామంలోని రైతులు కరువు సమస్య పోయి వర్షాలు సమృద్ధిగా కురవాలని, కోరుతూ రైతులు రోకలికి కప్పతల్లిని కట్టి వర్షాలు కురవాలని కప్పతల్లి కావాడి ఎత్తుకొని సర్పంచ్ మట్ట వెంకటేశ్వర రెడ్డి ఉప సర్పంచ్ తాళ విజయ్ వరుణ దేవుడిని ప్రసన్నం చేసుకోవడానికి నిర్వహించే ఒక సంప్రదాయ పూజా కార్యక్రమం. గ్రామంలోని ప్రధాన వీధుల్లో కప్పతల్లి కి కడుపునిండా నీరు పోయి అంటూ ఊరేగించారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు రైతులు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు

# విద్యార్థులు డ్రగ్స్ కి దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్తుకై కళలు కనాలి..

**విద్యార్థుల కదలికలపై అధ్యాపకులు నిరంతరం నిఘా ఉంచాలి:సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి..**




రాజన్న సిరిసిల్ల జిల్లా/ ప్రజాదివాస్ జూలై 20

విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మాధకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్తుకై కళలు కనాలని , ఆకళల సాధనకై నిత్యం శ్రమించాలని విద్యార్థులకి డిఎస్పీ నాగేంద్రచారి సూచించారు. తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వ్యవసాయ కళాశాలలో తెలంగాణ ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో మాధకద్రవ్యాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి తమ లక్ష్యాల సాధనకై నిత్యం శ్రమించాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని, కుటుంబాలను, భవిష్యత్తును నాశనం చేస్తాయని తెలిపారు. విద్యార్థుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని అధ్యాపకులకు సూచించారు. ఎవరైనా మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగం గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేసి సమాజ వినాశనానికి దారి తీసే మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలనీ పిలుపునిచ్చారు. జిల్లాలో డ్రగ్స్ లేదా గంజాయి విక్రయం, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా తెలంగాణ ఈగల్ ఫోర్స్ హెల్ప్‌లైన్ 8712671111కు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ ఈగల్ టీమ్ డిఎస్పీ ఉపేందర్, ఎస్.ఐ ఉపేందర్ చారి, కళాశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# విద్యార్థులు డ్రగ్స్ కి దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్తుకై కళలు కనాలి..

**విద్యార్థుల కదలికలపై అధ్యాపకులు నిరంతరం నిఘా ఉంచాలి:సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి..**




రాజన్న సిరిసిల్ల జిల్లా /ప్రజాదివాస్ జూలై 20

విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మాధకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్తుకై కళలు కనాలని , ఆకళల సాధనకై నిత్యం శ్రమించాలని విద్యార్థులకి డిఎస్పీ నాగేంద్రచారి సూచించారు. తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వ్యవసాయ కళాశాలలో తెలంగాణ ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో మాధకద్రవ్యాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి తమ లక్ష్యాల సాధనకై నిత్యం శ్రమించాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని, కుటుంబాలను, భవిష్యత్తును నాశనం చేస్తాయని తెలిపారు. విద్యార్థుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని అధ్యాపకులకు సూచించారు. ఎవరైనా మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగం గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేసి సమాజ వినాశనానికి దారి తీసే మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలనీ పిలుపునిచ్చారు. జిల్లాలో డ్రగ్స్ లేదా గంజాయి విక్రయం, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా తెలంగాణ ఈగల్ ఫోర్స్ హెల్ప్‌లైన్ 8712671111కు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ ఈగల్ టీమ్ డిఎస్పీ ఉపేందర్, ఎస్.ఐ ఉపేందర్ చారి, కళాశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల చివరి విడత బిల్లులు వెంటనే విడుదల చేయాలి: సీపీఎం

**– పెండింగ్ బిల్లులతో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు: లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్**
**– ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి: గురిజాల శ్రీధర్**



బోయినిపల్లి మండలం/ ప్రజాదివాస్ జూలై 20

బోయినిపల్లి మండలం రత్నంపేట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులైన దళిత కుటుంబాలను జిల్లా సీపీఎం కమిటీ సభ్యుడు గురజాల శ్రీధర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి దళితులు, గిరిజనులకు రూ.6 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీని పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే మూడు విడతల బిల్లులు విడుదల చేసినప్పటికీ, చివరి విడత బిల్లులు మంజూరు కాకపోవడంతో అనేక గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయని తెలిపారు. బిల్లుల కోసం లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న చివరి విడత బిల్లులను వెంటనే విడుదల చేసి, నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ప్రభుత్వ విప్ మరియు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, లబ్ధిదారులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని సీపీఎం పార్టీ తరఫున విజ్ఞప్తి చేశారు.

# ఆషాఢ సోమవారం వేళ వేములవాడకు పోటెత్తిన భక్తజనం.. ప్రత్యేక పూజలు, మొక్కుల సమర్పణ

వేములవాడ/ ప్రజాదివాస్ జూలై 20



దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని సోమవారం భక్తులతో తీవ్ర రద్దీగా మారింది. పవిత్రమైన సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచే తెలంగాణ నలుమూలల నుంచి భక్తులు వేములవాడకు భారీగా తరలివచ్చారు. ముందుగా పవిత్ర స్నానాలు ఆచరించిన అనంతరం స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్నారు. ఆషాఢ మాస వేడుకల్లో భాగంగా భక్తులు భీమేశ్వర స్వామివారికి పవిత్ర అభిషేకాలు జరిపించి, తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు. ముఖ్యంగా క్షేత్ర ఆచార ప్రకారం భక్తులు పెద్ద ఎత్తున కోడె మొక్కులు చెల్లించి స్వామివారిపై ఉన్న తమ భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్ల నిర్వహణతో పాటు తాగునీరు, నిత్య అన్నదానం ఇతర మౌలిక వసతులను సమర్థవంతంగా పరిశీలిస్తున్నారు. శ్రావణ మాసం సమీపిస్తుండటం, ఆషాఢ సోమవారం కావడంతో ఆలయ ప్రాంగణమంతా "ఓం నమః శివాయ" మంత్రస్మరణలతో మారుమోగిపోయింది.

# ఇంచార్జి డీపీఆర్ఓ గా శ్రీనివాసాచారి..

రాజన్న సిరిసిల్ల జిల్లా/ ప్రజాదివాస్ జూలై 20



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి డీపీఆర్ఓగా శ్రీనివాసాచారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిగా వ్యవహరిస్తున్న శ్రీనివాసాచారి ఇంచార్జి డీపీఆర్ఓగా బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. జర్నలిస్టులకు అందుబాటులో ఉండి.. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను చేరవేస్తామని పేర్కొన్నారు. జర్నలిస్టులు, అధికారులను సమన్వయంతో పని చేస్తూ ముందుకు వెళ్తానని తెలిపారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు జారీ చేస్తామని, త్వరితగతిన కార్డులు జారీ చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఇంచార్జి డీపీఆర్ఓ స్పష్టం చేశారు.

8

ప్రజా దివాస్ తెలుగు దినపత్రిక



# కామారెడ్డి జిల్లా నూతన అధ్యక్ష ఎన్నికపై దోమకొండ గ్రామ పెటిక కుల సభ్యుల వ్యతిరేకిస్తూ తీర్మానం



ప్రజాదివాస్

రాష్ట్ర పెటిక కార్యవర్గం 12/7/2026 నాడు నిజామాబాద్ జిల్లా పెటిక సంఘంలో కామారెడ్డి జిల్లా అధ్యక్ష పదవికి పిన్నెం.రామచంద్రం ఎన్నుకోవడం పై ఆదివారం అనగా 19/7/2026 రోజు దోమకొండ గ్రామ పెటిక కుల సదర్ మూడు పాండీల అధ్యక్ష కార్యదర్శులు మరియు సలహాదారులు సభ్యులందరు కలిసి కామారెడ్డి జిల్లా పెరికకుల సంఘం అధ్యక్షునిగా నవంబర్ 2025 లో పోతురాజు వెంకటేష్ గారిని ఏకగ్రీవంగా కామారెడ్డి జిల్లా లో గల వివిధ గ్రామాల సభ్యుల ఆధ్వర్యంలో ఎన్నుకున్న విషయం గుర్తు చేస్తూ దోమకొండ పెటిక కుల సదర్ మూడు పాంఢీల అధ్యక్ష కార్యవర్గ సభ్యులు రాష్ట్ర కార్యవర్గం తీసుకున్న నిర్ణయం పై వ్యతిరేకిస్తూ పదవి కాలం ముగిసేంత వరకు కామారెడ్డి జిల్లాలో పోతరాజు వెంకటేష్ జిల్లా అధ్యక్షులుగా కొనసాగుతారని తీర్మానించడం అయినది.

# సంవత్సరాలు గడుస్తున్నా పూర్తికాని ముత్యంపేట రోడ్డు

**- రోడ్డు నిర్మాణం పై అధికారుల కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం ఎందుకు**

**- అసంపూర్తి పనుల వలన కంకర తేలి పలు రోడ్డు ప్రమాదాలు**

ప్రజాదివాస్

దోమకొండ నుండి ముత్యంపేట వెళ్లే రోడ్డు నిర్మాణం పూర్తికాక వేసిన కంకర తేలి ప్రయాణికులకు ప్రమాదాలకు గురవుతున్నారు. సంవత్సరాలుగా ఈ



రోడ్డు నిర్మాణ పనులు నత్త నడకన సాగుతున్నాయని ప్రయాణికులకు ఇబ్బందికరంగా ఉందని రోడ్ కాంట్రాక్టర్ నిర్లక్ష్య వైఖరిని వ్యతిరేకిస్తూ అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను ఇతర కాంట్రాక్టర్ కు ఇవ్వాలని ప్రయాణికులు అధికారులకను కోరుతున్నారు. దోమకొండ మండలా నికి చెందిన చాలా గ్రామాలు జిల్లా కేంద్రమైన కామారెడ్డి అత్యవసర నిమిత్తం కుటుంబ అవసరాలకు వెళుతుంటారని మరియు దోమకొండ నుండి ముత్యంపేట రహదారి గుండా వెళ్లే వాహనాలు రిపేర్లకు గురవుతున్నాయని ప్రజల సౌకర్యార్థం వెంటనే రోడ్లు భవనాల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు

# కొల్లూరులో ఘనంగా 'భూ భారతి' భూ సర్వే గ్రామ సభ సహకరించాల్సిందిగా తహసిల్దార్ భాస్కర్ పిలుపు

ప్రజాదివాస్

ఝరాసంగం మండలం కొల్లూరు గ్రామంలో సోమవారం నాడు భూ భారతి భూ సర్వే గ్రామ సభను గ్రామ



పెద్దలు, రైతుల సమక్షంలో అత్యంత విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల రెవెన్యూ అధికారి తహసిల్దార్ భాస్కర్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో భాస్కర్ గారు మాట్లాడుతూ... "భూ భారతి" కార్యక్రమం ద్వారా గ్రామంలోని అన్ని సర్వే నంబర్లకు సంబంధించిన భూములను క్షుణ్ణంగా సర్వే చేసి, వాటికి స్పష్టమైన హద్దులను (హద్దుబంధులను) నిర్ణయించడం జరుగుతుందని స్పష్టం చేశారు. రైతుల మధ్య భూ వివాదాలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఈ సర్వే ఎంతగానో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. కావున, గ్రామ రైతులందరూ క్షేత్రస్థాయిలో జరిగే ఈ భూ సర్వేకు పూర్తి స్థాయిలో సహకరించి, తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఈ గ్రామ సభలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దప్పూర్ సంగమేష్, గ్రామ సర్పంచ్ చింతలగట్టు శివరాజ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (=×) మహాదేవ్, పంచాయతీ కార్యదర్శి రవి, జీపీఓ భాగ్య, మండల సర్వేయర్ నర్సింలు, మండల రెవెన్యూ సిబ్బంది, గ్రామ పెద్దలు, రైతులు మరియు స్థానిక యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆపరేషన్ ముస్కాన్ టీమ్ అధికారులతో సమీక్ష సమావేశం

రాజన్న సిరిసిల్ల జిల్లా/ప్రజాదివాస్ జూలై 20

గడిచిన 20 రోజుల్లో జిల్లాలో 61 మంది పిల్లలను రెస్క్యూ చేసి సిడబ్ల్యూసి ముందు హాజరుపరచగా తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి అప్పగించడం జరిగింది. 18 సంవత్సరాలలోపు పిల్లలను పనిలో పెట్టుకుని వారితో పని చేయిస్తున్న వారిపై 17 కేసులు నమోదు. సోమవారం రోజున జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యలయంలో అపరేషన్ ముస్కాన్ టీమ్ లో ఉన్న అన్ని శాఖల అధికారులతో అదనపు ఎస్పీ చంద్రయ్య సమీక్ష సమావేశం నిర్వహించరు. ఈసందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ... ఆపరేషన్ ముస్కాన్ లో భాగంగా జిల్లాలోని పరిశ్రమలు, హోటళ్లు, వ్యాపార సముదాయాలు, గోదాములు, మెకానిక్ షాపులు, ఇటుక బట్టీలు తదితర ప్రాంతాల్లో



వ్యూహాత్మకంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, బాల కార్మికులు లేదా తప్పిపోయిన బాలలను గుర్తించి, వారికి తగిన రక్షణ కల్పించి వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకుల వద్దకు చేర్చే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం కోసం పోలీసు శాఖతో పాటు సంబంధిత అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పకడ్బందీగా పనిచేయాలని, ప్రతి తనిఖీని ప్రణాళికాబద్ధంగా నిర్వహించి బాలల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఈసంవత్సరం జులై 1 నుండి 31 వరకు పోలీస్ శాఖ,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ,లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్, వివిధ డిపార్ట్మెంటు అధికారులతో జిల్లాలో టీమ్ లుగా ఏర్పాటు చేసి ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలను గుర్తించి విస్తృతంగా తనిఖీలు నిర్వహించి జిల్లా వ్యాప్తంగా గడిచిన 20 రోజులలో 61 మంది పిల్లలని గుర్తించి వారి యొక్క తల్లిదండ్రుల వద్దకు చేర్చడం జరిగిందని,18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుని వారితో పని చేయిస్తున్న వారిపై 17 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో డిసిర్బీ డిఎస్పీ భాస్కర్, ఐసిటియు లక్ష్మీరాజం, ఎస్.ఐ లు ప్రేమనందం, లాక్ప్రతి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం..

**- 36 ఫిర్యాదులు స్వీకరణ: ఎస్పీ మహేష్ బి.గితే..**

రాజన్న సిరిసిల్ల జిల్లా/ ప్రజాదివాస్ జూలై 20

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 36 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం



అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- 175 దరఖాస్తుల రాక**

రాజన్న సిరిసిల్ల జిల్లా/ప్రజాదివాస్ జూలై 20

ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అధికారులు బాధ్యతగా వ్యవహరించి ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా



ప్రజావాణి మొత్తం 175 దరఖాస్తులు వచ్చాయి. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని ఆదేశించారు. డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం తో పాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాల్లోనూ ప్రజావాణి కొనసాగుతుందని, స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో ప్రజావాణి కి 6, వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో 4 ప్రజావాణికి దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

# అక్రిడిటేషన్ జాప్యంపై గళమెత్తిన జర్నలిస్టులు

**- 'చలో కలెక్టరేట్' కు టీయూడబ్ల్యూజే హెచ్-143 పిలుపు..**

**- ఇల్లంతకుంటలో సభ్యత్వ నమోదు జిల్లా వ్యాప్తంగా ఐక్యతకు నాంది...**

**- జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా..**

ఇల్లంతకుంట మండలం/ ప్రజాదివాస్ జూలై 20

రాజన్న సిరిసిల్ల జిల్లాలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే హెచ్-143) ఉద్యమ కార్యాచరణను మరింత వేగవంతం చేసింది. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయడంలో జరుగుతున్న జాప్యంపై నిరసన వ్యక్తం చేస్తూ ఈ నెల 21వ తేదీ మంగళవారం ఉదయం 10:30 గంటలకు జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే "చలో కలెక్టరేట్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఇల్లంతకుంట మండల ప్రెస్ క్లబ్‌లో టీయూడబ్ల్యూజే హెచ్-143 సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఇల్లంతకుంట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా పాల్గొని సభ్యత్వాలను నమోదు చేశారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతరం పోరాటం చేస

# ప్రభుత్వ ఈఎన్ టీ డాక్టర్ ను సన్మానించిన సహ చట్టం నాయకుల..

ప్రజాదివాస్





కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జిజిహెచ్ ప్రభుత్వ ఆసుపత్రిలో చెవి,ముక్కు, గొంతు. స్పెషల్ డాక్టర్ బండారి భరద్వాజ్ ని సన్మానించిన సమాచారకు చట్ట పరిరక్షణ కమిటీ సభ్యులు. సోమవారం రోజున కామారెడ్డి పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ బండారి భరద్వాజ్ ఎం.బి.బి.ఎస్., ఎం.డి. చెవి ముక్కు గొంతు స్పెషలిస్ట్ సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ సభ్యుడు డి. రామచంద్రం కు ముక్కు తో బాధపడుతూ శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది ఉన్న పేషెంట్ ను చికిత్స చేసి ఆపరేషన్ ద్వారా కేవలం ఒక్క రోజులోనే ప్రత్యేక చేసి సరికొత్త విధానంతో శస్త్రచికిత్స చేసి న ఘనత డాక్టర్ భరద్వాజ్ కి దక్కిందని తెలియజేస్తూ..., కామారెడ్డి జిల్లా ఆస్పత్రిలోని అనేకమంది పేద ప్రజలకు, చెవి ముక్కు గొంతుతో బాధపడుతున్న రోగులకు సహాయ సహకారాలు అందిస్తున్నందుకుగాను సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ తరపున కామారెడ్డి జిల్లా ప్రతినిధులు, రాష్ట్ర డైరెక్టర్ ఏం ఏ సలీం ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఎం. రాజన్న కామారెడ్డి జిల్లా సలహాదారు టి. రామచంద్రం మహిళా జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, జిల్లా ప్రతినిధులు ఎం సుధాకర్, రాజు,ప్రదీప్ కుమార్, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి సీఐటీయూ ధర్నా..

-కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే విరమించుకోవాలి : చంద్రశేఖర్

ప్రజాదివాస్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి సంబంధించిన చట్టాలను పునరుద్ధరించాలని, కార్మికులకు నష్టాన్ని కలిగించే జీవో నెం.12ను సవరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కామారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ విక్టర్‌కు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ, తెలంగాణ భవన ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద బీమా, సహజ మరణ బీమా, శాశ్వత మరియు పాక్షిక అంగవైకల్య పథకాలను ప్రైవేట్ బీమా సంస్థల ద్వారా అమలు చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 2025 జూలై 22న జీవో నెం.12ను విడుదల చేసిందని తెలిపారు.ఈ జీవో విడుదలైన రెండు రోజుల్లోనే క్రెడిట్ యాక్సిస్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీకి రూ.250 కోట్లు, ఏర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి రూ.94 కోట్లు కలిపి మొత్తం రూ.346 కోట్లకు పైగా నిధులను ట్రయల్ బేజర్ బ్రోకర్స్ సంస్థ ద్వారా బదిలీ చేశారని ఆరోపించారు. ఇది 1996 భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టానికి విరుద్ధమని పేర్కొన్నారు.కార్మికులకు ప్రయోజనం లేని సీఎస్ హెల్త్ టెస్టుల పేరుతో సంక్షేమ బోర్డు నిధులను దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. తక్షణమే హెల్త్ టెస్టులను రద్దు చేసి ప్రతి కార్మికుడికి హెల్త్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు.1996 కేంద్ర చట్టం ప్రకారం వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీ నిర్ణయాల మేరకే నిధులు ఖర్చు చేయాల్సి ఉండగా, ప్రభుత్వం అలాంటి కమిటీని నియమించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు. గుర్తింపు లేని ప్రైవేట్ బీమా సంస్థలకు సంక్షేమ పథకాలను అప్పగించడం ద్వారా కార్మికులకు అన్యాయం జరుగుతోందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 2019 నుండి 2025 వరకు సుమారు 20 లక్షల మంది కార్మికులు బోర్డులో నమోదు చేసుకున్నప్పటికీ, కేవలం 15 లక్షల మందికే రెన్యూవల్ చేసి, ఒక్కో కార్మికుడికి రూ.239 ప్రీమియం చొప్పున మొత్తం రూ.346.36 కోట్లు ప్రైవేట్ బీమా కంపెనీలకు చెల్లించారని తెలిపారు. మరో 13 లక్షల మందికి పైగా కార్మికుల కార్డులు రెన్యూవల్ కాకపోవడంతో వారు సంక్షేమ పథకాలకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం బోర్డు అమలు చేస్తున్న 12 సంక్షేమ పథకాలలో నాలుగు మాత్రమే బీమా సంస్థలకు అప్పగించి, మిగతా వివాహ కానుక, ప్రసూతి సహాయం, ఆసుపత్రి



ఖర్చులు, అంత్యక్రియల ఖర్చులు వంటి పథకాలు సక్రమంగా అందడం లేదని పేర్కొన్నారు. హెల్త్ టెస్టుల పేరుతో సీఎస్ఐ సంస్థకు వందల కోట్ల రూపాయలు మళ్లించారని ఆరోపించారు.అందువల్ల ప్రభుత్వం వెంటనే జీవో నెం.12ను సవరించి సంక్షేమ పథకాలను ప్రైవేట్ బీమా సంస్థల ద్వారా కాకుండా నేరుగా వెల్ఫేర్ బోర్డు ద్వారానే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లకు వెంటనే నిధులు విడుదల చేయాలని, రెన్యూవల్ కాని లక్షలాది కార్మికుల కార్డులను అత్యవసరంగా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి సాయిబాబా, ఈశ్వర్, భూపతి రెడ్డి, శివరాజు, లింగం, భూమయ్య, రమేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.
9

# తెదేపా నేత ఉప్పుటూరి అప్పారావు కుటుంబ సభ్యులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పరామర్శ



ప్రజాదివాస్

చందర్లపాడు మండలం ఏటూరు గ్రామంలో తెదేపా నేత ఉప్పుటూరి అప్పారావు పెద్దకర్మ కార్యక్రమమునకు లాల్ బహుదూర్ లెఫ్ట్ కెనాల్ చైర్మన్ మరియు కూటమినేతలతో కలిసి హాజరైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఈ మేరకు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించి ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన సానుభూతిని తెలియజేశారు

# ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో అప్రమత్తం కావాలి..

- ప్రత్యామ్నాయ పంటల సాగుతోనే రైతులకు రక్షణ - ప్రభుత్వ ప్రధాన సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి

ప్రజాదివాస్

సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు సాంప్రదాయ పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి సూచించారు. గ్రామగ్రామాన రైతులకు అవగాహన కల్పిస్తూ, పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి చేపట్టాలని అధికారులను ఆదేశించారు.సోమవారం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి సమీక్ష సమావేశం సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కలెక్టర్లు ఇలా త్రిపాఠి, ఆశిష్ సంగ్వాన్, పోలీస్ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వివిధ శాఖల అధికారులు, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.సమావేశంలో శ్రీరాంసాగర్, నిజాంసాగర్, పోచారం, కౌలాస్ నాలా, అలీసాగర్ తదితర ప్రాజెక్టుల నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి సరఫరా, విద్యుత్ డిమాండ్-సరఫరా, ప్రత్యామ్నాయ పంటల సాగు అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, రైతులు వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటల స్థానంలో ఆయిల్ పామ్, కందులు, నువ్వులు, వేరుశనగ, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, కూరగాయలు, ఉద్యాన పంటలు సాగు చేయాలని సూచించారు. తక్కువ నీటితో అధిక ఆదాయం వచ్చే పంటలపై రైతులను ప్రోత్సహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.తీగజాతి కూరగాయలు, పందిరి పంటలు, పాడి పరిశ్రమలకు ప్రభుత్వం నుంచి రాయితీలు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కోతులు, అడవి పందుల బెడద నివారణకు సోలార్ ఫెన్సింగ్‌పై సబ్సిడీ కల్పించే అవకాశాలను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు.ఉమ్మడి జిల్లాలోని జలాశయాల్లో నీటి నిల్వలు ఆశించిన స్థాయిలో లేవని, భూగర్భ జలాలు క్రమంగా తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, ప్రతి రైతుకు వాస్తవ పరిస్థితులపై స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. తాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ఒక్క చుక్క నీరు కూడా వృథా కాకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు.ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 45 శాతం వర్షపాతం లోటు నమోదైందని, రైతులు పంటల వైవిధ్యాన్ని పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయిల్ పామ్, కూరగాయలు, ఆరుతడి పంటల సాగు ద్వారా రైతులు మెరుగైన ఆదాయం పొందవచ్చని సూచించారు.రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యోగితారాణా మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాలను ఆపలేకపోయినా ముందస్తు ప్రణాళికల ద్వారా నష్టాలను తగ్గించవచ్చని చెప్పారు. ప్రస్తుతం 72 శాతం విస్తీర్ణంలో విత్తనాలు వేయగా, మిగిలిన 28 శాతం



భూమిలో ఆరుతడి పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు.నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, పంటల మార్పిడి, ఆరుతడి పంటల సాగుపై రైతు వేదికల ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, ఉద్యానవన పంటలు, కూరగాయలు, పప్పుదినుసులు, ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులు తక్కువ నీటితో ఎక్కువ ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు.సమావేశంలో ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, తోట లక్ష్మీకాంత్ రావు, పైడి రాకేశ్ రెడ్డి తదితరులు రైతులకు ఫసల్ బీమా, సబ్సిడీ విత్తనాలు, డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం భూగర్భ జలాల పరిరక్షణపై రూపొందించిన “తెలంగాణ జలసిరి” గోడపత్రాలను ఆవిష్కరించారు.ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఆదర్శ రైతులు సమావేశంలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చెస్ బోర్డులు.. బట్ట సంచుల పంపిణీ

- అంతర్జాతీయ చెస్ దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమం

ప్రజాదివాస్




అంతర్జాతీయ చెస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లోని వావిలాలపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో (జీపీఎస్) లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చెస్ బోర్డులు, బట్ట సంచులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ చిన్ననాటి నుంచే విద్యార్థులకు చదరంగం ఆటపై ఆసక్తి పెంపొందించాలని సూచించారు. చెస్ ఆడడం వల్ల మేధాశక్తి, ఏకాగ్రత, క్రమశిక్షణ పెరుగుతాయని, తల్లిదండ్రులు పిల్లలను ఈ ఆటవైపు ప్రోత్సహించాలని కోరారు.అనంతరం విద్యార్థులకు బట్ట సంచులు అందజేసి, పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కరీంనగర్ అధ్యక్షురాలు శివకాంత్ పటేల్, జోనల్ చైర్మన్ ముక్క శరత్ కృష్ణ, కార్యదర్శి బట్టు వినోద్, ఖజాంచి మెతుకు కృష్ణ చైతన్య, జాయింట్ ఖజాంచి ఐత సూరజ్ కుమార్, జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్, తాటిపెల్లి సతీష్ బాబు, ప్రధానోపాధ్యాయురాలు కాపర్తి జ్యోతి లక్ష్మి, ఉపాధ్యాయురాలు కె. మమత, విద్యార్థులు పాల్గొన్నారు.

# చంద్రంపేటలో రాంగ్‌రూట్‌లో వచ్చిన ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు..



రాజన్న సిరిసిల్ల జిల్లా/ప్రజాదివాస్ జూలై 20

జిల్లా కేంద్రంలోని చంద్రంపేట సమీపంలో సోమవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం రాంగ్‌రూట్‌లో వస్తున్న ట్రాక్టర్ ఎదురుగా వెళ్తున్న స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీపై ప్రయాణిస్తున్న రగుడు గ్రామానికి చెందిన వెంకటేష్ గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పరిహారం చెల్లించాలి...నాణ్యత లేని పాదరక్షలు విక్రయించిన దుకాణం యజమానికి వినియోగదారుల కమిషన్ ఆదేశాలు

ప్రజాదివాస్

నాణ్యత లేని పాదరక్షలను విక్రయించి వినియోగదారుని కి ఇబ్బందులు కలిగించినందుకు ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సెంట్రో షోరూమ్‌పై తీర్పు వెలువరించింది. ఫిర్యాదుదారుని కి పాదరక్షల కొనుగోలు ధరతో పాటు నష్టపరిహారం, వ్యాజ్య ఖర్చులు చెల్లించాలని ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్ వి. లలిత, సభ్యురాలు ఎ.మాధవీలత సోమవారం తీర్పునిచ్చారు.

కేసు వివరాల ప్రకారం, ఖమ్మం జిల్లా వైరా మండలం తాటిపూడి గ్రామానికి చెందిన లింగాల ప్రవీణ్ కుమార్, ఖమ్మం జిల్లా కోర్టులో న్యాయవాద క్లర్క్‌గా పనిచేస్తున్నారు. కోర్టు సమీపంలోని సెంట్రో షోరూమ్ ప్రకటనలకు ఆకర్షితుడై 2025 ఆగస్టు నెలలో రూ. 1,599 విలువైన పాదరక్షలను కొనుగోలు చేశారు. అయితే, వాటిని కేవలం రెండు మూడు సార్లు మాత్రమే ఉపయోగించగానే చెప్పుల సోల్ లెదర్ దెబ్బతిని మధ్యలో పగిలిపోయింది. దీంతో ఫిర్యాదుదారుడు సెంట్రో షోరూమ్‌ను సంప్రదించి పాదరక్షలను మార్చివ్వాలని లేదా చెల్లించిన మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని పలు మార్లు కోరినా, షోరూమ్ యాజమాన్యం స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు అనవసరంగా ఆలస్యం చేసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

దీంతో ఫిర్యాదుదారుడు (జజ చీశీ. 25/2026) తమ న్యాయవాదులు వెల్లంపల్లి నరేంద్ర స్వరూప్, కొలికొండ శరత్ బాబు, తోట రామాంజనేయులు ద్వారా ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించారు. వాదనలు, సమర్పించిన ఆధారాలను పరిశీలించిన కమిషన్, సెంట్రో షోరూమ్ సేవల్లో లోపం (ఐవటఱఇఱవఅఎ్ఎ అఅ ఎావతీజఱఎ్వ) మరియు నాణ్యత లేని వస్తువు విక్రయించినట్లు నిర్ధారించింది. పాదరక్షల కొనుగోలు ధర రూ. 1,599/- ఫిర్యాదుదారునికి తిరిగి చెల్లించాలి,మానసిక వేదన, అసౌకర్యానికి పరిహారంగా రూ. 5,000/- ,వ్యాజ్య ఖర్చుల నిమిత్తం రూ. 5,000/- చెల్లించాలి. పై మొత్తాలన్నింటిని 45 రోజుల లోపు ఫిర్యాదు దారుని కి చెల్లించాలని ఈ రోజు



ఆదేశించింది. ఈ సందర్భంగా కమిషన్, వినియోగదారులను ఆకర్షించే ప్రకటనలు చేస్తూ నాణ్యత లేని వస్తువులను విక్రయించడం అనేది వినియోగదారుల హక్కులకు విరుద్ధమని పేర్కొంది. వినియోగదారుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించని వ్యాపార సంస్థలపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేసింది. ఫిర్యాదుదారుడు తమ న్యాయవాదులు వెల్లంపల్లి నరేంద్ర స్వరూప్, కొలికొండ శరత్ బాబు మరియు తోట రామాంజనేయులు ద్వారా ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ను సంప్రదించారు.

# చిల్లర్గి గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం..

**-సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించిన బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి**

ప్రజాదివాస్

ప్రజలు--పోలీసుల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో బాన్సువాడ సబ్ డివిజన్ డీఎస్పీ విఠల్ రెడ్డి సోమవారం పిట్లం మండలంలోని చిల్లర్గి గ్రామాన్ని సందర్శించి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులతో నేరుగా మమేకమైన డీఎస్పీ పలు సామాజిక, భద్రతా అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సైబర్ నేరాల నివారణ, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యత, రోడ్డు ప్రమాదాల నివారణ, హెల్మెట్ వినియోగం, గంజాయి వంటి మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై గ్రామ ప్రజలకు వివరించారు. నేటి డిజిటల్ యుగంలో సైబర్ మోసాలు




అధికమవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్ వంటి గోప్య సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు.గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు నేరాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుందని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడంలో ఇవి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి గ్రామం భద్రత కోసం ప్రజలు స్వచ్ఛందంగా సీసీ కెమెరాల ఏర్పాటు చేపట్టాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని కోరారు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని పేర్కొన్నారు.యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గంజాయి విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. మాదక ద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, కుటుంబాలు, సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వివరించారు.గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులతో సమన్వయంగా పనిచేయాలని, ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని డీఎస్పీ విఠల్ రెడ్డి కోరారు. ప్రజల సహకారంతోనే నేరరహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన అన్నారు.

# గిరిజన మహిళలపై అటవీ శాఖ అధికారుల దాడి దారుణం..!

**- మనుబోతులపాడులో పోడు రైతులపై బలప్రయోగం సరికాదు**

**- అటవీ హక్కుల చట్టాన్ని ఉల్లంఘించిన అధికారులు, సిబ్బందిపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలి**

**- దోషులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి**

**- గిరిజనుల హక్కులను కాలరాయొద్దు:**

**- మాజీ జెడ్పీటీసీ పాల్వంచ దుర్గ**

ప్రజాదివాస్

: అశ్వాపురం మండలం మనుబోతుల పాడు గ్రామంలో గిరిజన పోడు రైతులపై, ముఖ్యంగా గిరిజన మహిళలపై అటవీ శాఖ అధికారులు దౌర్జన్యానికి పాల్పడ్డా రనే ఆరోపణలను మాజీ జెడ్పీటీసీ పాల్వంచ దుర్గ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు సోమవారం జిల్లా సబ్ కలెక్టర్ వేణుగోపాల్‌తో పాటు జిల్లా అటవీ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేసిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.తరతరాలుగా సాగు చేస్తున్న పోడు భూముల్లోకి భారీ యంత్రాలతో ప్రవేశించి భూములను చదును చేయడానికి ప్రయత్నించడం, తమ జీవనాధారాన్ని కాపాడుకునేందుకు శాంతియుతంగా నిరసన తెలిపిన గిరిజన మహిళలపై బలప్రయోగానికి పాల్పడటం అత్యంత అమానుషమని ఆమె అన్నారు. షెడ్యూల్డ్ తెగలు మరియు ఇతర సాంప్రదాయ అటవీ నివాసుల (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం--2006 ప్రకారం గిరిజనులకు కల్పించిన హక్కులను పక్కనబెట్టి అధికారులు వ్యవహరించడం చట్టవిరుద్ధమని విమర్శించారు.అటవీ హక్కుల క్లెయిమ్‌లు పరిష్కారం కాకముందే భూములను చదును చేయడం, పంటలను ధ్వంసం చేయడం గిరిజనుల జీవన హక్కులపై ప్రత్యక్ష దాడేనని పేర్కొన్నారు. ఈ నెల 19న జరిగిన ఘటనపై ఉన్నతస్థాయి స్వతంత్ర విచారణ చేపట్టి, గిరిజన మహిళలపై దాడికి బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గాయ పడిన మహిళలకు మెరుగైన వైద్య చికిత్స అందించి, తగిన పరిహారం చెల్లించాలని కోరారు. అలాగే రెవెన్యూ, అటవీ, గిరిజన సంక్షేమ శాఖల సంయుక్త పరిశీలన పూర్తయ్యే వరకు మనుబోతుల పాడు ప్రాంతంలో భూముల చదునీకరణ, తొలగింపులు, బలవంతపు చర్యలను పూర్తిగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన గిరిజన రైతులందరికీ అటవీ హక్కుల పట్టాలు వెంటనే మంజూరు చేసి, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



గిరిజనుల రాజ్యాంగబద్ధమైన హక్కులను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్న పాల్వంచ దుర్గ, ఈ ఘటనపై నిష్పాక్షిక విచారణ జరిపి బాధ్యులైన అటవీ శాఖ అధికారులు, సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత రేంజర్, డివిజనల్ ఫారెస్ట్ అధికారులను బదిలీ చేసి, గిరిజనుల్లో విశ్వాసం పునరుద్ధరించే చర్యలు తీసుకోవాలని కోరారు. అదే వి ధంగా చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారిని తక్షణమే జోక్యం చేసుకుని శాఖాపరమైన దర్యాప్తు నిర్వహించాలని, రాష్ట్ర అటవీ శాఖ మంత్రి బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గిరిజనులకు జరిగిన అన్యాయంపై ప్రభుత్వం స్పందించకపోతే బాధితుల తరపున న్యాయపోరాటానికి కూడావెనుకాడబోమని పాల్వంచ దుర్గ హెచ్చరించారు.

# పట్టు చేనేత సహకార సంఘం నూతన భవనాన్ని నిర్మిస్తాం

**- పట్టు చేనేత సహకార సంఘ నూతన డైరెక్టర్లకి సన్మానం**

**- పెర్కిట్ ఎస్ ఎస్ కే సమాజ్ ఆధ్వర్యంలో**



ప్రజాదివాస్

పెర్కిట్ ఎస్ ఎస్ కె సమాజ్ ఆధ్వర్యంలో ఆర్మూర్ పట్టణంలోని పట్టు చేనేత సహకార సంఘానికి నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లను ఘనంగా సన్మానించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ లో ఆదివారం రాత్రి పెర్కిట్ ఎస్ ఎస్ కె సమాజ్ అధ్యక్షులు ఘటడి నారాయణ, ఉపాధ్యక్షులు బచ్చేవాళ్ నవభోజరాజు, కార్యదర్శి కర్తన్ రాజ్ కుమార్, కోశాధికారి ఘటడి ప్రవీణ్ ల ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన పట్టు చేనేత సహకార సంఘం అధ్యక్షులు గంగా మోహన్ చక్రు, ఉపాధ్యక్షులు షికారి శ్రీనివాస్, కార్యదర్శి బోచ్కర్ లక్ష్మీనారాయణ, కోశాధికారి బదాం రాజ్ కుమార్, డైరెక్టర్లు పడాల్ నరేందర్, బచ్చేవాల్ రెడ్డి శ్రీనివాస్, ఖాందేష్ సత్యనారాయణ లకు శాలువ పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పట్టు చేనేత సహకార సంఘం అధ్యక్షులు గంగామోహన్ చక్రు మాట్లాడుతూ పట్కరీ క్షత్రియ సమాజ్ మరియు పట్టు చేనేత సహకార సంఘ సభ్యుల కోరిక మేరకు ప్రభుత్వ మరియు దాతల సహకారంతో నూతన బిల్డింగ్ నిర్మాణం చేస్తామని అన్నారు. సర్వ సమాజ్ సభ్యులను సన్మానించిన పెర్కిట్ సమాజ్ పెర్కిట్ ఎస్ ఎస్ కె సమాజ్ కు చెందిన కర్తన్ రాజ్ కుమార్ ఘటడి ప్రవీణ్ లు ఆర్మూర్ ఎస్ ఎస్ కే సమాజము ద్వారా ఆర్మూర్ సర్వ సమాజ్ సభ్యులుగా ఎన్నుకోబడిన సందర్భంగా ఇరువురికి పూలమాలలు శాలువ తో పెర్కిట్ ఎస్ ఎస్ కె సమాజ్ పెద్దలు సన్మానం చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో పతి గంగా మోహన్, జుగ్గే కుమార్, ఘటడి తుకారాం, గటడి ప్రతాప్, కర్తన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల సవరణ (సర్ ),బీ ఎల్ ఏ -2 కార్యక్రమాన్ని పరిశీలించిన నియోజకవర్గ బీజేపీ నాయకులు తంబళ్ల రవి



ప్రజాదివాస్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట పంచాయతీ ఆఫీస్ నందు జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (సర్ ) ప్రక్రియను పరిశీలించిన బిజెపి నాయకులు,సర్ పక్రియ పారదర్శకంగా,నిష్పక్షపాతంగా నిర్వహించేలా చూడటంలో బూత్ స్థాయి ప్రతినిధుల పాత్ర అత్యంత కీలకమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు,నగరంలోని పలు చోట్ల జరుగుతున్న ఓటర్ల ధృవీకరణ సరిచూసే కార్యక్రమాన్ని పరిశీలించడం జరిగినది

ఈ సందర్భంగా నాయకులు తంబళ్ల రవి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా కేంద్ర ఎన్నికల సంఘం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు,అయితే,ఎక్కడా కూడా అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుండి తొలగించబడకుండా బీ ఎల్ ఏ -2 ఏజెంట్లు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ బూత్ స్థాయి అధికారులకు (బీ ఎల్ ఓ ) సహకరించాలని సూచించారు,ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట నియోజకవర్గం బీజేపీ నాయకులు తంబళ్ల రవి,బిజెపి సీనియర్ నాయకులు ధార నాగేశ్వరావు,పసుమర్తి పుల్లారావు,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కారం విద్యా శరణ్యకు సీటు కేటాయించిన అధికారులు

- స్పందించిన ఐ టీ డి ఏ పి ఓ . మరియు ఆర్ సి ఓ ..
- కారం విద్యా శరణ్యకు సీటు కేటాయించిన అధికారులు..
- ఆదివాసి సంఘ నాయకుల దృష్టికి రాగానే సమస్యకు పరిష్కారం..




ప్రజాదివాస్
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ములకలపల్లి మండలం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన ఆదివాసి గిరిజన దివ్యాంగ విద్యార్థిని “కారం విద్యా శరణ్య” పదో తరగతిలో 505 మార్కులు సాధించి వైరా గిరిజన గురుకులంలో ఇంటర్ మొదటి సంవత్సరం సీటు సాధించింది. కానీ, కాలేజీ హాస్టల్‌లో దివ్యాంగులకు తగిన మౌలిక సదుపాయాలు లేవనే సాకుతో కాలేజీ ప్రిన్సిపాల్ మాధవి లత అడ్మిషన్ నిరాకరించడంతో కుటుంబ సభ్యులు విద్యార్థిని తీవ్ర ఆవేదన గురై నేపథ్యంలో, ఆదివాసి సంఘ నాయకుల వెంటనే స్పందించి ఐ టీ డి ఏ పి ఓ తో మరియు ఆర్ సి ఓ తో మాట్లాడిన పొలిటికల్ జేఏసీ కన్వీనర్ వాసం రామకృష్ణ దొర ,జి ఎస్ ఎస్ రాష్ట్ర యువజన నాయకులు అరేం ప్రశాంత్,కాకా శివశంకర వరప్రసాద్ పాల్వంచ (జువీ=ా కొత్తగూడెం) బైపిసి గ్రూప్ సీట్ కేటాయించారు విద్యార్థిని తల్లిదండ్రులు సంతోషంతో మాకు సహకరించినందుకు ఆదివాసి నాయకులు ధన్యవాదాలు తెలియజేశారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆదివాసి విద్యార్థుల సమస్యలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఉన్నత పై స్థాయి చదువులు బాగా చదవాలని ఆకాంక్షిస్తూ ప్రజా సమస్యల పోరాటంలో నిరంతరం కృషి చేస్తామని తెలియజేశారు .ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆదివాసి నాయకులు వర్స వినోద్ కుమార్, విద్యార్థిని తల్లిదండ్రులు కారం వెంకటేశ్వర్లు

# పాస్తాపూర్ లో మురికి కాల్వల నిర్మాణానికి శంకుస్థాపన

- ఆర్యనగర్ లో తాగునీటి సమస్య పరిష్కారానికి బోరు మోటర్ ఏర్పాటు



ప్రజాదివాస్
జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించే దిశగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ తెలిపారు. సోమవారం 3వ వార్డు పరిధిలోని పాస్తాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న మురికి కాల్వల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన చైర్మన్ మహమ్మద్ యూనుస్, వర్షకాలంలో నీరు నిల్వ ఉండకుండా, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఆధునిక ప్రమాణాలతో మురికి కాల్వలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కాల్వల నిర్మాణం పూర్తయిన అనంతరం పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడి, దోమల వ్యాప్తి, అంటువ్యాధుల ప్రమాదం తగ్గడంతో పాటు స్థానికులకు మెరుగైన వాతావరణం ఏర్పడుతుందని అన్నారు.అనంతరం ఆర్యానగర్ లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు నూతన బోరు మోటార్ ను ఏర్పాటుచేసి ప్రారంభించారు. ఈ బోరు ద్వారా స్థానిక ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా చర్యలు తీసుకున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మున్సిపాలిటీ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తుందని తెలిపారు.ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నామని, ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఆయన అన్నారు. ప్రజల సహకారంతో జహీరాబాద్ ను మరింత అభివృద్ధి చెందిన పట్టణముగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు శ్రీధర్ రెడ్డి, బొగ్గుల సంతోష్, బిజెపి పార్టీ పట్టణ అధ్యక్షులు పూల సంతోష్, సీనియర్ నాయకులు సుధీర్ బండారి, రాజకీయ ప్రముఖులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బ్యాంకుల వద్ద మోసగాళ్లపై బాన్సువాడ పోలీసుల నిఘా..

-ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఖాతాదారులకు అవగాహన కల్పించిన ఇన్‌స్పెక్టర్ తులా శ్రీధర్

ప్రజాదివాస్
కామారెడ్డి జిల్లా బాన్సువాడ బ్యాంకుల వద్ద అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడే వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ బాన్సువాడ టౌన్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. బాన్సువాడ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ తులా శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పట్టణంలోని వివిధ బ్యాంకుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా బ్యాంకు పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు, అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తుల వివరాలను సేకరించి వారి రాకపోకల ఉద్దేశ్యాలను ఆరా తీశారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యక్తుల వివరాలను కూడా పరిశీలించారు. బ్యాంకుల వెలుపల పార్కింగ్ చేసిన ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను తనిఖీ చేసి సంబంధిత పత్రాలను పరిశీలించారు.బ్యాంకులకు వచ్చే వృద్ధులు, మహిళలు, చదువురాని మరియు అమాయక ఖాతాదారులను లక్ష్యంగా చేసుకుని సహాయం పేరుతో నగదు లేదా విలువైన వస్తువులను దోచుకునే ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ప్రజలకు ప్రత్యేక అవగాహన కల్పించారు. నగదు ఉపసంహరణ సమయంలో అపరిచితుల సహాయం తీసుకోవద్దని, ఏటీఎం పిన్, ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, డెబిట్ లేదా క్రెడిట్ కార్డు సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు.తాము బ్యాంకు అధికారులు లేదా సైబర్ క్రైమ్ అధికారులు అని చెప్పి ఫోన్ చేసే వ్యక్తులను నమ్మవద్దని, అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని హెచ్చరించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ప్రజలకు



సూచించారు.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని బ్యాంకుల్లో జరిగే చోరీలు, మోసాలు మరియు ఇతర నేరాలను అరికట్టేందుకు ఇటువంటి ఆకస్మిక తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని ఇన్‌స్పెక్టర్ తులా శ్రీధర్ తెలిపారు. బ్యాంకుల వద్ద అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన ప్రజలను కోరారు.
4

# ప్రజావాణిలో 121 అర్జీలు స్వీకరణ..

-ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలి అదనపు కలెక్టర్ విక్టర్

ప్రజాదివాస్
జిల్లా ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 121 దరఖాస్తులు స్వీకరించినట్లు అదనపు కలెక్టర్ విక్టర్ తెలిపారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను, వినతులను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అదనపు కలెక్టర్ విక్టర్



స్వయంగా అర్జీదారులను కలిసి వారి సమస్యలను ఓపికగా విన్నారు. భూ వివాదాలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, పెన్షన్లు, రెవెన్యూ, విద్యుత్, తాగునీరు, గృహనిర్మాణం తదితర అంశాలకు సంబంధించిన వినతులు అందినట్లు తెలిపారు.ప్రజల నుంచి అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ, వాటిని నిర్లక్ష్యం చేయకుండా ప్రాధాన్యతతో పరిశీలించాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం చేయకుండా నిబంధనల ప్రకారం త్వరితగతిన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి వచ్చే ప్రతి వినతిని బాధ్యతగా తీసుకుని సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల వద్ద తమ సమస్యలను నేరుగా తెలియజేసే వేదికగా నిలుస్తోందని, అధికారులు కూడా ప్రజల పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) పాండు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాలలో దేవాలయాల్లో వరుస చోరీలకు పాల్పడిన ముగ్గురు నిందితుల అరెస్టు భారీగా సొత్తు స్వాధీనం

ప్రజాదివాస్
ఖమ్మం జిల్లా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు దేవాలయాల్లో వరుస చోరీలకు పాల్పడిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు వారి వద్ద నుండి భారీగా బంగారం వెండి ఆభరణాలతో పాటు నేరాలకు ఉపయోగించిన వాహనాలు ఇతర పనిముట్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు అరెస్ట్ అయిన నిందితులను తల్లాడకు చెందిన షేక్ జానీ అలియాస్ జానీ షరీఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఎటపాకకు చెందిన పేరాల నరసింహారావు అలియాస్ బాబి కొత్తగూడెంకు చెందిన అరవ ఉదయ్ కుమార్ గా పోలీసులు గుర్తించారు జులై 19న సాయంత్రం వీరు దొంగిలించిన బంగారం వెండి వస్తువులను విక్రయించడానికి కారు మోటార్ సైకిల్ పై తిరువూరు వెళు తుండగా సీతారామపురం గ్రీన్ ఫీల్డ్ హైవే సమీపంలో పోలీసులు వీరిని పట్టుకున్నారు పంచుల సమక్షంలో విచారించగా తాము పలు దేవాలయాల్లో వరస దొంగతనాలకు పాల్పడినట్లు నిందితులు ఒప్పుకున్నారు నిందితులు చేసిన ప్రధాన చోరీల వివరాలను పోలీసులు వెల్లడించారు జూన్ 27న కొత్తగూడెం హనుమాన్ బస్తీ హనుమాన్ ఆలయంలో బంగారు బొట్టు జూన్ 28న పెనుబల్లి మండలం ఉప్పల చేలక అక్కమ్మ గుడి మరియు రామాలయంలో హుండీలోని మూడు బంగారు సూత్రాలను దొంగిలించారు జూన్ 30న తల్లాడ మండలం అంజనపురం హనుమాన్ ఆలయంలో వెండి కిరీటం వెండి నేత్రం వెండి తమలపాకుల హారంతో పాటు కల్లూరు మండలం గనియ తండా హనుమాన్ ఆలయంలో రెండు వెండి నేత్రాలను అపహరించారు అలాగే జులై వేంసూర్ మండలం లింగపాలెం హరి హర క్షేత్ర దేవాలయంలో రెండు బంగారు సూత్రాలు వెండి తమలపాకుల గొలుసు వెండి యజ్ఞోపవీతం నాలుగు వెండి నేత్రాలు రెండు వెండి ఉత్తర జంజాలను దొంగిలించారు జులై 7న ఆంధ్రప్రదేశ్ గోకవరం గంగాలమ్మ ఆలయంలో బంగారు నేత్రాలు బంగారు



సూత్రాలు వెండి త్రాడు వెండి ముక్కుపుడక వెండి హారం మరియు జులై 10న పెనుబల్లి మండలం బయన్నగూడెంలో వెండి కిరీటాన్ని చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు నిందితుల నుంచి పోలీసులు 24 గ్రాముల బంగారం 1.536 కిలోల వెండి వస్తువులు ఒక కారు ఒక మోటార్ సైకిల్ తో పాటు చోరీలకు ఉపయోగించిన ఇనుప రాడ్ సుత్తి కటింగ్ ప్లేయర్ స్క్రూ డ్రైవర్ను స్వాధీనం చేసుకున్నారు దేవాలయాల్లో ఇలాంటి చోరీలో పునరావృత్తం కాకుండా ఆలయ కమిటీలు తగిన భద్రతా చర్యలు చేపట్టాలని అలాగే తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు

## ఎస్ ఎస్ కె సమాజ్ అధ్యక్షుడిగా ఎన్నికైన గటడి ఆనంద్ కు సన్మానించిన న్యాయవాది లోక భూపతిరెడ్డి

ప్రజాదివాస్
ఆర్మూర్ పట్టణ క్షత్రియ (పట్కరి) ఖత్రి కులానికి ఇటీవలే అధ్యక్షులుగా ఎన్నికైన ప్రముఖ న్యాయవాది గటడి ఆనంద్ ను శాలువా తో సన్మానం చేసిన న్యాయవాదులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా క్షత్రియ సమాజ ఎస్ ఎస్ కె సమాజ్ అధ్యక్షుని గా ఎన్నికైన ఘటడి ఆనంద్ సమాజానికి సేవ చేసి పేరు ప్రఖ్యాతులు పెంచుకోవాలని సీనియర్ న్యాయవాదులు లోకా భూపతిరెడ్డి ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో న్యాయవాదులు రుయ్యాడి రాజేశ్వర్ రెడ్డి, ఏలేటి గంగాధర్, జక్కుల శ్రీధర్, కీర్తి సాగర్, రామగిరి వేణు పాల్గొన్నారు



## ఇదంతా అభిమానుల చలవే.. ప్రేమతో మీ ధనుష్!



72వ జాతీయ పురస్కారాలుధనుష్‌కు రెండింతల ఆనందాన్ని తీసుకొచ్చాయి. ఆయన దర్శకత్వంలో వచ్చిన 'రాయన్' ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా (తమిళ) ఎంపికవడంతో పాటు.. 'కెప్టెన్ మిల్లర్')తో ధనుష్ స్పెషల్ మెన్షన్ (నటుడు) గౌరవాన్ని పొందిన సంగతి తెలిసిందే. దర్శకుడిగా జాతీయ స్థాయిలో తొలిసారి అవార్డును సొంతం చేసుకోవడం, నటుడిగా నాలుగోసారి జ్యూరీ గుర్తింపును పొందడంపై ధనుష్ ఆనందం వ్యక్తం చేశారు. ఎంపిక కమిటీకి, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. ఇన్‌స్టా పోస్టులో తన భావాలను ఇలా పంచుకున్నారు."ఓం నమశ్శివాయ..! జాతీయ పురస్కారాల్లో 'రాయన్' ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా ఎంపిక కావడంతో పాటు, 'కెప్టెన్ మిల్లర్'తో స్పెషల్ మెన్షన్( నటుడు) గుర్తింపు దక్కడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ సందర్భంగా జాతీయ చలనచిత్ర అవార్డుల జ్యూరీకి, ఎంపిక కమిటీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. కెరీర్ తొలినాళ్ల నుంచి మద్దతుగా నిలిచిన మీడియాకు ధన్యవాదాలు. నటుడిగా ఇది నాకు నాలుగో జాతీయ అవార్డు కాగా, దర్శకుడిగా మొట్టమొదటిది. నాకు ఇంత శక్తినిచ్చి, నా ఎదుగుదలకు మూలస్తంభాలుగా నిలిచిన నా అభిమానులే లేకపోతే ఇవేవీ సాధ్యమయ్యేవి కావు. అందుకు వారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను" 'కెప్టెన్ మిల్లర్'కు వచ్చిన గుర్తింపు మరింత ప్రత్యేకమైనది. ఎందుకంటే ఇప్పటివరకూ నేను అత్యుత్తమ నటన కనబర్చింది ఈ చిత్రంలోనే అని మొదటినుంచి బలంగా విశ్వసిస్తున్నాను. నా మనసుకు అంత దగ్గరైన పాత్రకు ఇప్పుడు స్పెషల్ మెన్షన్ గౌరవం దక్కడంతో ఈ విజయం మరింత అర్థవంతంగా మారింది. అలాగే మొదటి విజయం ఎప్పటికీ మర్చిపోలేనిది. 'రాయన్'తో దర్శకుడిగా దక్కిన తొలి జాతీయ పురస్కారాన్ని జీవితాంతం విలువైన జ్ఞాపకంగా దాచుకుంటాను. మన ఆలోచనలను బట్టే మన జీవితం ఉంటుందనే మాటను ప్రతిసారీ చెబుతుంటాను. ఈ సందర్భంలోనూ అదే మాటను గుర్తుచేసుకుంటున్నాను. హర్ హర్ మహాదేవ్! ప్రేమతో మీ ధనుష్" అని ఆయన తన ఆనందాన్ని పంచుకున్నారు.


# 'రామాయణ' చిత్రం భారతదేశం కల: యశ్



'రామాయణ' చిత్ర బృందం

"మన శ్రీరాముడి కథని.. గ్లోబల్ వేదికపై నిలబెట్టాలి.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు చూపించాలనే ఉద్దేశంతో చేసిన చిత్రమే 'రామాయణ" అన్నారు నటుడు, నిర్మాత యశ్. నితేశ్ తివారీ దర్శకత్వంలో ముస్తాబైన ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి నటించిన సంగతి తెలిసిందే. యశ్ ఇందులో రావణుడి పాత్రను పోషిస్తూనే.. నమిత్ మల్హోత్రాతో కలిసి స్వయంగా నిర్మించారు. ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుండగా.. 'రామాయణ: పార్ట్ 1' దీపావళి సందర్భంగా నవంబరులో విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే ఈనెల 24న ట్రైలర్ విడుదల చేయనున్నారు. దీనిలో భాగంగా శనివారం దిల్లీలో ప్రథమ్ సంకల్ప్ పేరుతో వేడుకను నిర్వహించి.. ట్రైలర్‌ని ప్రత్యేకంగా ప్రదర్శించారు. "ఇది కేవలం సినిమా కాదు. భారతదేశం కల. ఆ కలని నిజం చేయడం కోసం మేమంతా కలిశాం" అన్నారు నటుడు, నిర్మాత యశ్. ఈ కార్యక్రమంలో రణ్‌బీర్, సాయిపల్లవి, రకుల్ ప్రీత్ సింగ్, వివేక్ ఒబెరాయ్, సన్నీ డేఒల్, శోభన తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలోకి తిరిగి రావాలనే ఆలోచనే లేదు: ఐశ్వర్య



ప్రస్తుతం 'గట్టా కుస్తీ 2' విజయాన్ని ఆస్వాదిస్తున్న నటి ఐశ్వర్య లక్ష్మి వరుస ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. ఇందులో బాలీవుడ్ ఎంట్రీ సహా రెండు వెబ్ సిరీస్‌లు, ఒక ఫిమేల్ లీడ్ తమిళ సినిమాలో నటిస్తున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఫెమినిజం, సోషల్ మీడియా, కామెడీ, తన రాబోయే చిత్రాల గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు."గట్టా కుస్తీ 2' సినిమా బాక్సాఫీస్ కలెక్షన్ల వివరాలను ఎప్పటికప్పుడు నా టీమ్ తెలియజేస్తూ ఉంటుంది. వీటికన్నా కూడా ప్రేక్షకులు సినిమా ఆస్వాదించడమే నాకు అసలైన సంతృప్తి. థియేటర్లలో వారు నవ్వుతుంటే అదే మాకు ఆనందం. దాని కోసమే కదా మేం కష్టపడేది. 'గట్టా కుస్తీ 2' చక్కటి వినోదాన్ని పంచుతూనే స్త్రీ, పురుష సమానత్వాన్ని ప్రతిబింబిస్తుంది. ఒక మహిళ తన కలలను సాకారం చేసుకోవడానికి పురుషుడు ఏవిధంగా వెన్నంటి నిలిచాడన్నది ఈ చిత్ర కథాంశం. ప్రియాంక చోప్రానే తీసుకోండి.. భర్త నిక్ జోన్స్ ప్రతి విషయంలో ఆమెకు అండగా ఉంటాడు. మా మూవీ కూడా ఇదే చెబుతుంది""నాకు సినిమాల్లో కామెడీ సన్నివేశాలు చేయడం ఇష్టం. కానీ, కామెడీ పండించడంలో నేను ఇంకా మెరుగుపడాలి. ఇప్పటివరకూ నేనెప్పుడూ సోషల్ మీడియాలో సురక్షితంగా ఉన్నట్లు అనిపించలేదు. అది లేకుండా పని చేయడం చాలా సులభం. ప్రస్తుతం సోషల్ మీడియాలోకి తిరిగి రావాలనే ఆలోచనే లేదు. గతంలో నా ఫొటోలను మార్ఫ్ చేయడం, కామెంట్లు పెట్టడం వల్ల అందరూ నన్ను ద్వేషిస్తున్నట్లు అనిపించేది. ఇప్పుడు ప్రజలను నేరుగా కలవడం సంతోషంగా ఉంది. రోజుకు రూ.100 కోట్లు ఇచ్చినా సోషల్ మీడియా దరిదాపుల్లోకి వెళ్లను. నా డాగ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా మాత్రమే వార్తలు, సినిమా అప్‌డేట్స్ చూస్తాను" అని ఐశ్వర్య పేర్కొన్నారు. ప్రస్తుతం ఐశ్వర్య ఆనంద్ దర్శకత్వంలో ఒక ఫిమేల్ సెంట్రిక్ తమిళ సినిమాలో పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. తర్వాత 'తీవినయ్ పొట్రు', 'లవ్' అనే రెండు వెబ్ సిరీస్‌లు ఐశ్వర్య లక్ష్మి ఖాతాలో ఉన్నాయి. బాలీవుడ్‌లో కూడా ఆమె ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన ఇంకా రాలేదు.

# పాత్ర ఏదైనా పరకాయ ప్రవేశమే

ఓ నాయికగా గ్లామర్ కంటే కథకు, వైవిధ్యమైన పాత్రలకు ప్రాధాన్యం ఇచ్చే తక్కువమంది నాయికల్లో యామీ గౌతమ్ ఒకరు. నాయికా ప్రాధాన్య చిత్రాల్లో సత్తా చాటే ఈ తార 'ఆర్టికల్ 370'లో పోషించిన ఇంటెలిజెన్స్ అధికారిణి జూనీ హక్సర్ పాత్రతో మరింత గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఈ పాత్రే ఆమెని జాతీయ ఉత్తమ నటిగా నిలబెట్టింది. జమ్మూకశ్మీర్‌లోని ఆర్టికల్ 370 రద్దుకు సంబంధించిన అత్యంత కీలకమైన ఆపరేషన్‌లో ఇంటెలిజెన్స్ అధికారిణిగా దేశభక్తిని చాటుతూ.. భావోద్వేగమైన సందర్భాలలో కూడా పాత్రలో గంభీరతని ప్రదర్శించి, ఉత్కంఠభరితమైన యాక్షన్ సన్నివేశాలతో సినీప్రియుల్ని ఆకట్టుకున్నారు. నిశ్శబ్ద సన్నివేశాల్లో కళ్లతోనే కట్టిపడేశారామె. 'నేను ఎంచుకునే సినిమాలు ప్రస్తుత సంఘటనలతో ముడిపడి ఉంటున్నాయేమో అందుకే సామాజిక మాధ్యమాల్లో నన్ను విమర్శిస్తున్నారు'అని చెప్పే యామీ ఇటీవలే 'హక్' చిత్రంలో షాజియా పాత్రలో కనిపించి తన నటనతో ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. ఆమె ఎక్కువగా సీరియస్ పాత్రల్నే పోషిస్తుందని అనుకుంటున్న సమయంలో 'బాల' చిత్రంతో నవ్వులు పూయించిన నాయిక ఈమె. పాత్ర ఏదైనా కానీ అందులోకి పరకాయ ప్రవేశం చేయడమే యామికి తెలుసంటూ అందరిచేత ప్రశంసలు అందుకునే ఈ నాయిక ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉంది.



# కొత్త అనుభూతినిచ్చే థ్రిల్లర్.. న్యూటన్స్ థర్డ్ లా



"ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని అందించే థ్రిల్లర్ సినిమా 'న్యూటన్స్ థర్డ్ లా" అన్నారు హీరో సుమంత్. ఈ చిత్రంపై తామంతా ఎంతో నమ్మకంగా ఉన్నామని.. ఇది కచ్చితంగా అందర్నీ మెప్పిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 'అనగనగా' విజయం తర్వాత ఈటీవీ విన్ సంస్థలో సుమంత్ చేసిన కొత్త చిత్రమే 'న్యూటన్స్ థర్డ్ లా'. రాజేశ్ కర్ణ దర్శకత్వం వహించారు. కె.హరీశ్ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 31న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో ఈ చిత్రం నుంచి "ధమ్ ధమ్.." అనే పాటని విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో సుమంత్ మాట్లాడుతూ.. "ఈ స్క్రిప్ట్ విన్న వెంటనే దీంట్లోని వినయ్, కార్తీక్ పాత్రలు చాలా బలంగా ఉండాలని చెప్పా. ఆ రెండు పాత్రలు అద్భుతంగా వస్తే సినిమా ఆడుతుందని చెప్పా. ఇప్పుడు విడుదలైన పాట ఆ రెండు పాత్రలపైనే ఉంటుంది. ఈ సినిమాలో ప్రతి పాత్రకీ చాలా ప్రాధాన్యత ఉంటుంది. 'అనగనగా'కి బెస్ట్ యాక్టర్ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది. ఈ సందర్భంగా ఈటీవీ విన్‌కి ధన్యవాదాలు" అన్నారు. "ఇకపై థ్రిల్లర్ జానర్ గురించి మాట్లాడినప్పుడల్లా ఈ సినిమా పేరు తప్పకుండా వినిపిస్తుంది" అన్నారు దర్శకుడు రాజేశ్ కర్ణ. ఈటీవీ విన్ సాయికృష్ణ మాట్లాడుతూ.. "సుమంత్‌తో మా ప్రయాణం 'అనగనగా'తో మొదలైంది. ఇప్పుడీ సినిమాతో మా జైత్రయాత్రని కొనసాగిస్తామని నమ్ముతున్నాం" అన్నారు. ఈ కార్యక్రమంలో సింజిత్ యర్రమిల్లి, కె హరీశ్, కృష్ణ చైతన్య, వేదవ్యాస్, గౌతమ్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.